నేటి కందం-నేటికి అందం

గాసిని తొలగించ నగర
వాసుల సౌఖ్యమును బెంచ వసతులు గూర్చన్
మూసీ ప్రక్షాళనమును
భాసురముగ ముఖ్యమంత్రి ప్రకటించె ధృతిన్ !!

(నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు, నగర వాసులకు మరిన్ని వసతులు కల్పించేందుకు మూసీ ప్రక్షాళన సుందరీ కరణ అనే ప్రాజెక్టు ను ముఖ్యమంత్రి కేబినెట్లో ఆమోదించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

నిజాలను ప్రభుత్వం
నిట్టాడుకు కట్టేసింది
మేడిగడ్డ దోషులను
మూలగోటు నెట్టేసింది.
సాంకేతిక కారణాల్లో
సమస్యను తోసేసింది
ప్రాజెక్టును బాగుచేసే
ప్రయత్నం వదిలేసింది

చురక

-వేల్పుల నారాయణ
9440433475



website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 7-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:258 పేజీలు:6 వెల: రూ.1/-


## ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు

**-ఏళ్ల తరబడి ఫైళ్లు పెండింగ్‌లో పెడితే ఎలా**
**-డివిజన్ స్థాయిలో పరిష్కరించగల ఒక్క ఫైల్ కూడా పెండింగ్‌లో ఉండొద్దు**
**-రెవెన్యూ, అటవీ అధికారులపై మంత్రి జూపల్లి ఆగ్రహం**
**-కొల్లాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ.. 16 అంశాలపై సమీక్ష**



మహబూబ్‌నగర్, జులై 6: ప్రజలు ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, అధికారులు ఫైళ్లను పెండింగ్‌లో ఉంచడం సరికాదని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌కు ఫైళ్లను పంపించడం పరిపాలన కాదని, ప్రజల సమస్యలకు చట్టబద్ధమైన, శాశ్వత పరిష్కారం చూపడమే అసలైన పరిపాలన అని స్పష్టం చేశారు.

సోమవారం కొల్లాపూర్ నియోజకవర్గంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ, అటవీ, భూ సమస్యలపై ఆర్డీఓ కార్యాలయంలో మంత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఒరిజినల్ ఫైళ్లు, నోట్ ఫైళ్లు, సంబంధిత రికార్డులను తెప్పించి ఒక్కో అంశాన్ని స్వయంగా పరిశీలించారు.

ఫైళ్లు ఏ దశలో ఉన్నాయి, ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి, ఎవరి వద్ద నిలిచిపోయాయి, పరిష్కారం కోసం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. గతంలో పలుమార్లు సమీక్షలు నిర్వహించి ఆదేశాలు ఇచ్చినా అనేక అంశాలు ఇప్పటికీ అదే దశలో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

"ఒక ఫైల్ మీ వద్దకు వస్తే మరో అధికారికి పంపించి చేతులు దులుపుకోవడం కాదు. క్షుణ్ణంగా పరిశీలించి చట్టబద్ధమైన పరిష్కారం చూపాలి" అని మంత్రి అధికారులకు సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ అనవసరంగా ఫైళ్లను పెండింగ్‌లో ఉంచితే సహించేది లేదని హెచ్చరించారు.

**16 అంశాలపై సమీక్ష**

ముక్కిడిగుండం, సోమశిల, రామాపురం, ఎల్లూరు, జటప్రోలు, గోపాలపురం శివారు, సింగోటం, కొల్లాపూర్, చింతలపల్లి, సోమశిల రోడ్డు, చౌటబెట్ల శివారుకు సంబంధించిన పోడు పట్టాలు, ఆర్ఓఎఫ్ఆర్, రెవెన్యూ-అటవీ భూ వివాదాలు, జాయింట్ సర్వేలు, పట్టాదారు హక్కులు, లావోని పట్టాలు, భూ రికార్డుల సవరణ, ఫోడి సర్వే, పీఓటీ రెగ్యులరైజేషన్, భూభారతి, వ్యవసాయ మార్కెట్ యార్డు, హార్టికల్చర్ పాలిటెక్నిక్, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 16 అంశాలపై మంత్రి క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు.

ప్రతి అంశానికి సంబంధించిన అర్జీదారులను సమావేశానికి పిలిపించి, గ్రామ పాలన అధికారి (జీపీఓ), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, సర్వే అధికారులు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బందితో కలిసి సమస్యలను పరిశీలించారు. ఎవరి స్థాయిలో ఏ నివేదిక ఇవ్వాలి, ఎవరు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకుని రికార్డు చేయాలని ఆదేశించారు.

డివిజన్ స్థాయిలో పరిష్కరించగల ఒక్క ఫైల్ కూడా పెండింగ్‌లో ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. కలెక్టర్ స్థాయిలో నిర్ణయం అవసరమైన అంశాలకు పూర్తి ప్రతిపాదనలు, సంబంధిత రికార్డులతో వెంటనే పంపాలని ఆదేశించారు.

**ప్రతి ఫైల్‌కు కార్యాచరణ ప్రణాళిక..**

ప్రతి ఫైల్ ఏ దశలో ఉంది, ఎందుకు పెండింగ్‌లో ఉంది, ఏ అధికారి వద్ద ఉంది, తదుపరి ఎవరు ఏ చర్య తీసుకోవాలి, ఎంత గడువులో పరిష్కరించాలనే వివరాలతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు.

క్యాంపు కార్యాలయం నుంచి వచ్చే ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించాలని, విచారణకు అవసరమైతే సమయం తీసుకున్నా ఫైళ్లను అనవసరంగా పెండింగ్‌లో ఉంచొద్దని చెప్పారు. ప్రజలు మళ్లీ అదే సమస్యతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా దీర్ఘకాలిక సమస్యలకు చట్టబద్ధమైన, శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో రెవెన్యూ, సర్వే, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు..



హైదరాబాద్, జులై 6: తెలంగాణ పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కీలక చర్యలు చేపట్టారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం క్యాంపస్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై వారికి కీలక సూచనలు చేశారు.

ముఖ్యంగా హైదరా బాద్‌లోని పర్యాటక ప్రాంతాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు ముఖ్యమంత్రి. గొల్కొండ సమీపంలోని తారామతి బారాదరిని టూరిజం ప్రాంతంగా మరింత అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిద్దాలని ఆదేశించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లోని వీరభద్రస్వామి దేవాలయాన్ని డెవలప్ చేసి యాదాద్రి తరహాలో ఆలయానికి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

క్యూర్ పరిధిలోని అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో భాగ్యనగరంలో ఎకో పార్కులను తీర్చిదిద్దాలని ఆజ్ఞాపించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్నారు. అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఏర్పాట్లు చేయాలని, ఆ ప్రాజెక్టుల కోసం ప్రత్యేక అధికారిని నియమించి వనులను ముమ్మరం చేయాలన్నారు. పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అవకాశం ఉంటే ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలన్నారు ముఖ్యమంత్రి. డిసెంబరులో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పైనా కసరత్తు ప్రారంభించాలని, సమ్మిట్ కోసం శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కాగా, ఈ సమీక్షా సమావేశానికి సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి హాజరయ్యారు.

## సీఎం ములుగు పర్యటనకు ఏర్పాట్లు వేగవంతం

**-6వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**
**-వరద పరిస్థితులు, అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం**




ములుగు, జులై 6:రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ములుగు జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగవంతం చేయాలని, 6000 కొట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేపట్టనున్నారని రాష్ట్ర పంచాయతీ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితులు, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి జిల్లాలో చేపట్టనున్న పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.మేడారం అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను వచ్చే పది రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి మేడారం, ములుగు జిల్లాల్లో పర్యటించనున్నారని, ఈ పర్యటనలో సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.6,000 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి ప్రారంభం పలకనున్నారని మంత్రి వెల్లడించారు.ఘట్టమ్మ సమీపంలో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ములుగు కలెక్టరేట్ భవనం, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, కేంద్ర విద్యాలయం సహా పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. సీఎం పర్యటన తేదీని త్వరలో ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.

## ముంబైలో కొనసాగుతున్న భారీ వర్షాలు.. రెడ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ..



ముంబై , జులై 6: ముంబై మహానగరాన్ని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా ముంబై నగరం స్తంభించిపోయింది. పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. డబ్బావాలాల సేవలు నిలిచిపోయాయి. ముంబై యూనివర్సిటీ పరిధిలో జరగాల్సిన అన్ని పరీక్షలు వాయిదా పడ్డాయి. ముంబై రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రైల్వే స్టేషన్లు కూడా జలమయమయ్యాయి. మరోవైపు భారీ వర్షాలతో విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది

మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో భారత వాతావరణ శాఖ ముంబై, థానే, రాయగడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యంత భారీ వర్షాలు, గంటకు 80?90 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా విరార్-వసాయి ప్రాంతంలో డబ్బావాలాల ఇళ్లు నీట మునిగాయి. అలాగే పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇక, ముంబై మాంఖుర్ద్ ప్రాంతంలో ఇళ్లు కూలి ఆరుగురు మృతి చెందారు. మృతుల కుటుంబాలకు మహారాష్ట్ర సీఎం రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు

ఐఎండీ హెచ్చరికల ప్రకారం రానున్న గంటల్లో కూడా ముంబైలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది . పరిస్థితిని ఎదుర్కొనేందుకు విపత్తు నిర్వహణ బృందాలు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. సుమారు 15 వేల మంది సిబ్బంది సహాయక చర్యల కోసం సిద్ధమవుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరదలు, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటి పరిస్థితులు తలెత్తే ప్రమాదముందని ప్రభుత్వం హెచ్చరించింది.

## ధైర్యానికి శాశ్వత నిదర్శనం..
## శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ప్రధాని మోదీ నివాళి..

న్యూ ఢిల్లీ, జులై 6:భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు.

ప్రధాని మోదీ తన బ్లాగ్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను ప్రస్తావించారు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, దేశసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని చెప్పారు. వలస పాలన, విభజన రాజకీయాలు, సామాజిక సవాళ్ల వంటి అంశాలపై ఆయన రాజీపడకుండా పోరాడారని గుర్తు చేశారు.

దేశ సమైక్యతే శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజాజీవితానికి మూలసూత్రమని ప్రధాని అన్నారు. దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్ భారతదేశంలోనే కొనసాగడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అనంతరం జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనానికి కృషి చేస్తూ నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏలను 2019లో తమ ప్రభుత్వం రద్దు చేసిందని, అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ప్రధాని మోదీ అభివర్ణించారు

అలాగే కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత పిన్న వయసులో వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామా ప్రసాద్.. పరిశోధన, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు.






## పలు లభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం



ములుగు, జులై 6: వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో సోమవారం బీజీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ. ఎల్కతుర్తి నుంచి మడిపల్లి వరకు ఐదు కిలోమీటర్ల తారు రోడ్డు పనులు చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. ఎల్కతుర్తి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

## తిరుమల కొండపైకి కాలినడకన 116 ఏళ్ల వృద్ధురాలు..
## విషయం తెలిసి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించిన టీటీడీ

తిరుపతి, జులై 6:తిరుమల శ్రీవారి దర్శనం కోసం కాలి నడకన వచ్చిన 116 ఏళ్ల వృద్ధురాలు నవనీతమ్మకు టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించింది. నవనీతమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు. ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా వెల్లడించారు.

వందేళ్లు దాటిన వృద్ధురాలు శనివారం నాడు అలిపిరి నడక మార్గంలో తిరుమలకు వచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను కొంతమంది సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. అయితే ఆ వృద్ధురాలిది కర్ణాటక అని మొదట ప్రచారం జరిగింది. ఇది చూసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వృద్ధురాలి వివరాలు తెలిస్తే టీటీడీ ఆఫీసులో సంప్రదించాలని ఎక్స్‌లో పోస్టు కోరారు. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ సిబ్బంది ఆమె వివరాలను సేకరించారు. వృద్ధురాలిని తమిళనాడుకు చెందిన నవనీతమ్మగా గుర్తించి, టీటీడీ చైర్మన్‌కు సమాచారం అందించారు.వృద్ధురాలి వివరాలను తెలుసుకున్న బీఆర్ నాయుడు ఆమెతో పాటు కుటుంబసభ్యులకు వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం టీటీడీ అధికారులు వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు.

## కీవ్‌పై భీకర దాడి.. భారీ పేలుళ్లు.. ఉక్రెయిన్ విలవిల..

న్యూ ఢిల్లీ, జులై 6: ఉక్రెయిన్‌పై మళ్లీ విరుచుకుపడింది రష్యా. కీవ్ నగరంలో సోమవారం ఉదయం బీభత్సం సృష్టించారు. మిస్సైళ్లు, డ్రోన్లతో రష్యా అటాక్ చేసింది. జెలెన్‌స్కీ ప్రభుత్వ చర్యకు ప్రతీకారంగా ఆ దాడి చేసినట్లు రష్యా రక్షణ దళం పేర్కొన్నది. సోమవారం తెల్లవారుజామున 1.30 నిమిషాలకు తొలి అటాక్ జరిగింది. ఉదయం 5 గంటల వరకు అనేక ప్రాంతాల్లో పేలుళు సంభవించాయి. చాలా శక్తివంతమైన బాంబుల మోత మోగినట్లు తెలుస్తోంది. ఆయుధ డిపో, ఉత్పత్తి కేంద్రం, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను టార్గెట్ చేసి ఉంటారని అంచనా వేస్తున్నారు. సుదీర్ఘ దూరం ప్రయాణించే ఆయుధాలతో ఉక్రెయిన్ మిలిటరీ పరిశ్రమలు, ఇంధన కేంద్రాలపై దాడి చేసినట్లు రష్యా రక్షణ దళం పేర్కొన్నది. కీవ్ నగరంలోని అనేక ప్రాంతాల్లో భారీ స్థాయిలో మంటలు వ్యాపించాయి. రష్యా సుమారు 68 మిస్సైళ్లు, 351 డ్రోన్లతో అటాక్ చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొన్నది. ముఖ్యంగా ఉక్రెయిన్ మిలిటరీ ఉత్పత్తి కేంద్రాలను ఈసారి టార్గెట్ చేశారు. కానీ రెసిడెన్షియల్, సివిలియన్ కేంద్రాల్లోనూ విధ్వంసం జరిగినట్లు ఉక్రెయిన్ ఆరోపించింది.

ఎక్కడెక్కడ టార్గెట్ చేశారన్న అంశాన్ని రష్యా మిలిటరీ పేర్కొన్నది. కీవ్‌తో పాటు కీవ్ పరిసర ప్రాంతాలు, డెనిప్రోపెట్రోవ్‌స్కీ, పోల్టావా, చెర్‌కాసీ, చెర్నిగోవ్ ప్రాంతాలపై అటాక్ జరిగింది. అబ్రిస్ పీటూ అనే కేంద్రంపై కూడా దాడి జరిగింది. ఇక్కడ డ్రోన్లు ఉత్పత్తి జరుగుతోంది. యూఏవీలు, ఆర్మోటెక్ కోసం ఇక్కడ రేడియో ఎక్విప్మెంట్‌ను కూడా ఉత్పత్తి చేస్తారు. మిస్సైళ్ల వార్‌హెడ్స్ తయారు చేసే కేంద్రాన్ని కూడా రష్యా పేల్చివేసింది. నేవీ డ్రోన్లు తయారు చేసే కుజ్నియా రెబల్స్‌కామ్ షిప్‌యార్డు, నెప్ట్యూన్ క్షిపణులు తయారు చేసే కేంద్రాన్ని కూడా ధ్వంసం చేశారు.

# పెంపుడు జంతువులతో జాగ్రత్తగా ఉంటున్నారా !

## (06 జూలై “ప్రపంచ జునోసిస్ దినం” సందర్భంగా)

అనాదిగా మనిషికి, పశుపక్ష్యాదులకు మధ్య అవిభాజ్య సంబంధం బలపడింది. గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో ఎడ్లు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, పిల్లులు, బాతులు, పక్షులు, గుర్రాలు, పందులు, కుందేళ్లు మొదలైన పెంపుడు జంతువులు భాగమై ఉంటాయి. ఈ పెంపుడు జంతువులతో మానవులు ప్రేమను పంచుకుంటూ, వాటిని కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వాటి ఆలనాపాలనా చూసుకుంటూ, ఎత్తుకొని ముద్దు చేస్తూ, భుజాన వేసుకొని తిరుగుతూ ఉంటారు. ఇలాంటి సాదు జంతువులు వ్యాధికారక సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులతో ఇన్ఫెక్ట్ అయితే ఆయా జంతువుల నుంచి మానవులకు కొన్ని ప్రమాదకర వ్యాధులు సంక్రమిస్తాయి. ఈ విధంగా జంతువుల నుంచి మనుషులకు (జునోటిక్) లేదా మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే (రివర్స్ జునోటిక్) వ్యాధులను “జునోటిక్ వ్యాధులు”గా పిలుస్తాం. దాదాపు 130 రకాల సూక్ష్మజీవులు, 60 వరకు పరాన్నజీవుల వల్ల దాదాపు 250 రకాల జునోటిక్ వ్యాధులు సోకుతాయని వెల్లడయ్యింది. . ప్రంచవ్యాప్తంగా 114కు పైగా దేశాల్లో జునేటిక్ వ్యాధుల బెడద అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రతి 10 వ్యాధుల్లో 6 జునోటిక్ సంబంధ వ్యాధులే ఉన్నాయని తెలుస్తున్నది.

### ప్రపంచ జునోసిస్ దినం-2026 ఇతివృత్తం:

జునోటిక్ వ్యాధుల పట్ల సంపూర్ణ అవగాహన, నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించే వేదికలుగా ప్రతి ఏట 06 జూలై రోజున “ప్రపంచ జునోసిస్ దినం (వరల్డ్ జునోసిస్ డే)” పాటించనట ఆనవాయితీగా మారింది. 06 జూలై 1885 రోజున “లూయీ పాశ్చర్” అను ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు తొలిసారి పిచ్చి కుక్క కరిచిన వ్యక్తికి ఆంటీ రాబిస్ టీకా ఇవ్వడం జరిగింది. ఈ విప్లవాత్మకమైన ఘనతకు గుర్తుగా ప్రతి ఏట 06 జూలైన ప్రపంచ జునోసిస్ దినం పాటించడం పరిపాటి అయ్యింది. ప్రపంచ జునోసిస్ దినం-2026 ఇతివృత్తంగా “ఒకే ప్రపంచం, ఒకే ఆరోగ్యం (వన్ వరల్డ్, వన్ హెల్త్)” అను అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం 61 శాతం వ్యాధులు జునోటిక్ సంబంధమైనవే అని, దాదాపు 1400 వ్యాధికారక సుక్ష్మజీవులు లేదా పాథోజెన్స్ పలు రకాల జంతువులను ఇన్ఫెక్ట్ చేస్తాయని, గత దశాబ్ద కాలంలో కరోనా లాంటి 75 శాతం కొత్త జునోటిక్ వ్యాధులే ఉన్నాయని తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 మిలియన్ల ప్రజలు సాదు జంతువులతో సహజీవనం చేస్తున్నారు. ఈగలు, దోమలు, పేలు, కీటకాలతో కూడా జునోటిక్ వ్యాధులు సంక్రమించవచ్చు. గతంలో మిలియన్ల ప్రజల మరణాలకు కారణం అయిన బొవైన్ టిబీ, బుబోనిక్ ప్లేగ్, గ్లార్స్, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు కూడా జునోటిక్ సంబంధమైనవా మాత్రమే అని తెలుసుకోవాలి.

### జునోటిక్ వ్యాధులు సోకడానికి కారణాలు:

ప్రత్యక్షంగా వ్యాధికారక బ్యాక్టీరియా లేదా వైరస్ సోకిన పెంపుడు జంతువుల లాలాజలం, మూత్రం, మలం, రక్తం, శ్లేష్మం లాంటివని మనుషులు తాకినపుడు జునోటిక్ వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతువులను తాకినా, సమీపంలో గడిపినా, గోర్లతో గీకినా కూడా ఈ వ్యాధులు రావచ్చు. కలుషిత, పూర్తిగా ఉడకని ఆహారం (మాంసం, గుడ్లు, పాలు, జంతువులు ముట్టిన పండ్లు) తీసుకున్నపుడు కూడా ఈ వ్యాధులు రావచ్చు. పచ్చి పాలు తాగినా జునేటిక్ వ్యాధులు రావచ్చని, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులకు కూడా జునోటిక్ వ్యాధులు సులభంగా సోకుతాయి.

భారత్‌లో జునోటిక్ వ్యాధుల బెడద అధికంగా కనిపిస్తున్నది. సాదు జంతువులు, జంతు ప్రయోగశాలలు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, పశు వైద్యులు, చర్మం/తోళ్ళ పరిశ్రమలు, ధాన్య గిడ్డంగులు జునోటిక్ వ్యాధులకు కారణాలుగా నిలుస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. పాడి పంటలు, సాదు జంతువులే జీవనోపాధులుగా గడుపుతున్న పేద కుటుంబాలకు జునోటిక్ వ్యాధుల సమస్యలు అధికంగా ఉంటున్నాయి.

### జునోటిక్ వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు:

జునోటిక్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జంతువులను తాకిన ప్రతిసారా చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. దోమలు, ఈగలు లాంటివని రాకుండా జాగ్రత్త పడాలి. పచ్చి పాలు తాగడం మానేయాలి. ఆహారాన్ని పూర్తిగా ఉడికించాలి. వంట సామాగ్రిని శుభ్రంగా కడగాలి. చనిపోయిన జంతువులను భూమిలో పాతి పెట్టాలి. జంతువులను తాకు సందర్భాల్లో మాస్కులు, చేతి గ్లౌజులు ధరించాలి. అధిక కాలం ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన ఆహారాన్ని తీసుకోరాదు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. జంతు మలమూత్రాలతో నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. త్రాగే నీటిని మరిగించి వాడాలి. గర్భిణులు, శిశువులు, వృద్ధులు, అవయవ మార్పిడి చేయించుకున్న వారు, మధుమేహం గల వారు, ఆల్కహాల్ సేవించే వారు జునోటిక్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

పెంపుడు జంతువులతో జాగ్రత్తగా మసులుకుంటూ, జీవనోపాధులను పొందుతూ, జునోటిక్ వ్యాధులకు దూరంగా, ఆరోగ్యకర కుటుంబాలకు దగ్గరగా జీవిద్దాం, జంతు సంబంధ వ్యాధులను పొలిమేరలు దాటిద్దాం.



-మధుపాళీ
9949700037

# రాజస్థాన్‌లోని బలోత్రాలో అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల ముఖ్యాంశాలను పంచుకున్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, జులై 6:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు రాజస్థాన్‌లోని బలోత్రాలో సుమారు రూ. 1.06 లక్షల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడాన్ని అభినందిస్తూ... తీవ్రమైన వేసవి ఎండను సైతం లెక్కచేయకుండా వచ్చిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం ప్రస్తుత ప్రభుత్వానికి లభించిన గొప్ప ఆమోదంగా ప్రధానమంత్రి అభివర్ణించారు.

‘ఎక్స్’ వేదికగా చేసిన వరుస పోస్టుల్లో కార్యక్రమ ముఖ్యాంశాలను పంచుకుంటూ, శ్రీ మోదీ ఇలా పేర్కొన్నారు:

జోధ్‌పూర్ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు... ఇది రాజస్థాన్ వ్యాప్తంగా పర్యాటకం, వాణిజ్యం, ఆర్థిక అవకాశాలనూ బలోపేతం చేస్తుంది.

అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన, దేశంలోని ప్రతి ప్రాంతాన్నీ అనుసంధానించాలనే మన నిబద్ధతతో భారత విమానయాన రంగం దూసుకుపోతూనే ఉంది.

పచ్‌పద్రలో ఈ రోజు హెచ్‌పీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీ పేరుతో సమీకృత రిఫైనరీ- కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ప్రారంభించుకున్నాం. ఈ చరిత్రాత్మక ప్రాజెక్టు భారత ఇంధన భద్రతను బలోపేతం చేస్తుంది. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తుంది. ఉపాధినీ కల్పిస్తుంది. ఆర్థిక పరివర్తనను వేగవంతం చేస్తుంది. స్వయం సమృద్ధ భారత్ దిశగా మన ప్రయాణంలో ఇది మరో కీలక ముందడుగు.

రాజస్థాన్‌లోని బలోత్రాలో ఉన్న దేశపు తొలి గ్రీన్‌ఫీల్డ్ సమీకృత రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను సందర్శించే అవకాశం నాకు లభించింది. ఈ అత్యాధునిక రిఫైనరీ మన ఇంధన రంగానికి కొత్త ఊపునిస్తుంది.

నగరాల అనుసంధానాన్ని వేగంగా విస్తరించడానికి మేం కట్టుబడి ఉన్నాం. ఈ దిశగా, ఈ రోజు జైపూర్ మెట్రో రెండో దశకు శంకుస్థాపన చేయడం నాకు చాలా ఆనందంగా ఉంది.

ఈ రోజు, రాజస్థాన్‌కు చెందిన సుమారు 54,000 మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను అందజేయడం నాకు అపారమైన సంతృప్తినిస్తోంది. నేను వారిని అభినందిస్తూ, రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.

రాజస్థాన్‌లోని బలోత్రాకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన నా కుటుంబ సభ్యుల ఉత్సాహం... రాష్ట్రంలో జరుగుతున్న సర్వతోముఖాభివృద్ధి పనుల పట్ల వారు ఎంత సంతోషంగా ఉన్నదీ తెలియజేస్తుంది.

గత దశాబ్ద కాలంగా దేశ ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి మనం అపూర్వమైన ప్రయత్నాలు చేశాం. ఈ ప్రయత్నాల ఫలితంగానే 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని నవ భారత్ సంకల్ప బలం విజయవంతంగా అధిగమించింది.

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా తలెత్తిన డీజిల్, పెట్రోల్ సంక్షోభ సమయంలో... రకరకాల వదంతులు, రాజకీయ భయాందోళనలు ప్రచారంలో పెట్టారు. భారత్ తన దౌత్యం, స్నేహం ద్వారా ప్రతి సంక్షోభాన్నీ అధిగమించి, దురుద్దేశపూర్వక బెదిరింపులన్నింటినీ తిప్పికొట్టింది.యుద్ధకాలంలో రైతులకు తలెత్తిన ఎరువుల సమస్య అయినా... ఎంఎస్ఎంఈలు ఎదుర్కొన్న సవాళ్లు అయినా... వాటిని పరిష్కరించడానికి మేం సకాలంలో, సరైన చర్యలు తీసుకున్నాం. దీని కారణంగానే, వారు ఈ రోజు సురక్షితంగా ఉన్నట్లు భావిస్తున్నారు.

మన ప్రభుత్వం ఇతర ఇంధన వనరులపైనా పని చేస్తోంది. రాజస్థాన్‌పై సూర్యుని అనుగ్రహం ఉన్నందున, ప్రపంచ స్థాయి సోలార్ పార్కులు, సౌరశక్తి సంబంధిత ప్రాజెక్టుల అభివృద్ధికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు ఆ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రధాని

న్యూఢిల్లీ, జులై 6:అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకొని ఆ దేశ అధ్యక్షుడు శ్రీ డొనాల్డ్ ట్రంప్‌తో పాటు ప్రజలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత్-అమెరికా భాగస్వామ్యానికి ఉన్న శాశ్వతమైన బలాన్ని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య సంబంధాలు కేవలం వ్యూహాత్మక భాగస్వామ్యానికే పరిమితం కాకుండా ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన, ఇరు దేశ ప్రజల అపరిమిత సామర్థ్యాలపై గల నమ్మకం అనే ఉమ్మడి విలువల పునాదిపై ఈ బంధం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు.

“అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ చారిత్రాత్మక సందర్భంగా 140 కోట్ల మంది భారతీయ ప్రజల తరపున అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు అమెరికా ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

భారత్, అమెరికాల మధ్య బంధం కేవలం ఒక వ్యూహాత్మక భాగస్వామ్యం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలనపై మనకున్న ఉమ్మడి నమ్మకం, మన ప్రజల అపరిమితమైన సామర్థ్యమే మన మైత్రిని ప్రపంచ శ్రేయస్సుకు ఒక బలమైన శక్తిగా నిలిపాయి.

రాబోయే 250 సంవత్సరాలు అమెరికాకు మరింత శ్రేయస్సును, శాంతిని, ప్రగతిని చేకూర్చాలని.. భారత్-అమెరికా భాగస్వామ్యాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను.”



న్యూఢిల్లీ, జులై 6:అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకొని ఆ దేశ అధ్యక్షుడు శ్రీ డొనాల్డ్ ట్రంప్‌తో పాటు ప్రజలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత్-అమెరికా భాగస్వామ్యానికి ఉన్న శాశ్వతమైన బలాన్ని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య సంబంధాలు కేవలం వ్యూహాత్మక భాగస్వామ్యానికే పరిమితం కాకుండా ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన, ఇరు దేశ ప్రజల అపరిమిత సామర్థ్యాలపై గల నమ్మకం అనే ఉమ్మడి విలువల పునాదిపై ఈ బంధం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు.

“అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ చారిత్రాత్మక సందర్భంగా 140 కోట్ల మంది భారతీయ ప్రజల తరపున అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు అమెరికా ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

భారత్, అమెరికాల మధ్య బంధం కేవలం ఒక వ్యూహాత్మక భాగస్వామ్యం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలనపై మనకున్న ఉమ్మడి నమ్మకం, మన ప్రజల అపరిమితమైన సామర్థ్యమే మన మైత్రిని ప్రపంచ శ్రేయస్సుకు ఒక బలమైన శక్తిగా నిలిపాయి.

రాబోయే 250 సంవత్సరాలు అమెరికాకు మరింత శ్రేయస్సును, శాంతిని, ప్రగతిని చేకూర్చాలని.. భారత్-అమెరికా భాగస్వామ్యాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను.”

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం..



ఆదిలాబాద్, జులై 6:వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువలేనివని దళిత సంఘాల నాయకులు హాజమ్మ, కొండను గోపాల్ అన్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో సోమవారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా దళిత సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక న్యాయం కోసం పోరాడిన నాయకుడిగా, భారత మాజీ ఉప ప్రధానిగా విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని దేశ సేవ చేశారని గుర్తు చేశారు.

స్వాతంత్ర్యం అనంతరం మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర మంత్రిగా వివిధ కీలక శాఖలను నిర్వహిస్తూ దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని కొనియాడారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు.

వ్యవసాయం, రక్షణ, కార్మిక సంక్షేమం వంటి కీలక రంగాల్లో విశేష సేవలు అందించిన బాబు జగ్జీవన్ రామ్ నిజాయితీ, ప్రజాసేవ, అంకితభావంతో భారత రాజకీయ చరిత్రలో గొప్ప నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండన్ భారత్, కొక్కు నరసింహ, తిమ్మప్ప, సహదేవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం బదిలీ..



కరీంనగర్, జులై 6: సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం బదిలీ అయ్యారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సోమవారం ఆయన సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు.

జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందిన సూర్యాపేట పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సాయిరాం ప్రత్యేక చర్యలు చేపట్టారు.

రహదారుల వెంట ఆక్రమణల తొలగింపు, రద్దీ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటును పర్యవేక్షించడం వంటి చర్యలతో ట్రాఫిక్ నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చారు.

సాయిరాం స్థానంలో సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న యాదవేందర్ రెడ్డి ట్రాఫిక్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సాయిరాంను పలువురు అభినందించి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# భారత్ లో చిప్ డిజైన్ నుంచి అమరిక, ప్యాకేజింగ్ వరకు పూర్తి సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించడమే మన లక్ష్యం: ప్రధాని

న్యూ ఢిల్లీ, జులై 6:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు గుజరాత్‌లోని సనంద్ లో సీజీ సెమీ అవుట్‌సోర్స్డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్’ (ఓఎస్ఏటీ) కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, దేశం తన లక్ష్యాల పట్ల కలిగి ఉన్న అచంచలమైన నిబద్ధతకు ఈ ప్రారంభోత్సవం ఒక నిదర్శనమని ప్రధానమంత్రి అభివర్ణించారు. దేశం తాను అనుకున్న బలమైన సంకల్పాలను ఎటువంటి సంకోచం లేకుండా నిరంతరం వాస్తవరూపంలోకి మారుస్తుందని ఆయన స్పష్టం చేశారు. “భారతదేశం ఏదైనా చేయాలని సంకల్పిస్తే, దానిని కచ్చితంగా సాధిస్తుందనడానికి నేటి ఈ కార్యక్రమమే నిదర్శనం” అని శ్రీ మోదీ అన్నారు.

ఐదేళ్ల క్రితం ప్రారంభమైన వ్యూహాత్మక దార్శనికతను గుర్తుచేసుకుంటూ, దేశాన్ని అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి అంతర్జాతీయ కేంద్రంగా మార్చడమే దీని ప్రధాన లక్ష్యమని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. స్వదేశీ డిజైన్, స్థానిక తయారీ అనే విస్తృత వ్యూహాల ఆధారంగా, దేశంలోని ఈ మూడవ అతిపెద్ద కేంద్రంలో వాణిజ్యపరమైన చిప్ ప్యాకేజింగ్ అధికారికంగా ప్రారంభం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. “మనం డిజైన్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా అనే ప్రాథమిక మంత్రంతో విజయవంతంగా ముందుకు సాగాం” అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్ట్ వేగవంతమైన అభివృద్ధి కాలక్రమాన్ని గుర్తుచేసుకుంటూ, 2024 లో తానే దీనికి శంకుస్థాపన చేశాననీ, ఆగస్టు 2025 నాటికే చిప్ టెస్టింగ్ వేగంగా ప్రారంభం అయిందనీ ప్రధానమంత్రి ప్రస్తావించారు. ప్రాజెక్ట్ ప్రారంభం నుంచీ పూర్తి స్థాయి ఉత్పత్తి దశకు చేరుకోవడానికి పట్టిన ఈ అత్యంత వేగవంతమైన ప్రయాణానికి ప్రాజెక్టుతో ముడిపడి ఉన్న అనేకమంది అసోసియేట్ల అలుపెరగని అంకితభావం, ఏకాగ్రతలే ప్రత్యక్ష కారణమని ఆయన కొనియాడారు. “శంకుస్థాపన నుంచి ఉత్పత్తి దశ వరకు సాగిన ఈ అద్భుతమైన ప్రయాణం కచ్చితంగా ఎంతోమంది సహోద్యోగుల అపారమైన కష్టానికి లభించిన ఫలితమే” అని శ్రీ మోదీ అన్నారు.

సభను ఉద్దేశించి ప్రసంగించడానికి కొన్ని క్షణాల ముందు తాను జరిపిన వ్యక్తిగత సంభాషణలను ప్రస్తావిస్తూ, ఆ కేంద్రంలో పనిచేస్తున్న అంకితభావం గల సిబ్బందితో మాట్లాడిన అనుభవాలను ప్రధానమంత్రి పంచుకున్నారు. ప్రదర్శనను సందర్శించిన సమయంలో అనేక మంది యువ నిపుణులతో నేరుగా మాట్లాడిన ఆయన, వారి ఉత్సాహం, ఆశావాదం, సానుకూల దృక్పథాన్ని ప్రశంసించారు. “ఈ రోజు నేను కలిసిన ప్రతి యువ సహోద్యోగి పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నారు” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

కొత్తగా ప్రారంభించిన ఈ కేంద్రాన్ని అంతర్జాతీయ భాగస్వామ్యానికి ఒక దీపస్తంభంగా అభివర్ణిస్తూ, స్వదేశీ, జపాన్ థాయ్‌లాండ్ పరిశ్రమల భాగస్వాములను అనుసంధానించిన ఉమ్మడి ప్రయత్నాలను ప్రధానమంత్రి అభినందించారు. ఈ వెంచర్‌ను కేవలం ఒక సాధారణ వాణిజ్య సంస్థగా మాత్రమే కాకుండా, సాంకేతిక విశ్వసనీయతకూ, సరిహద్దులు దాటిన భాగస్వామ్యానికీ ఒక బలమైన నమూనాగా ఆయన అభివర్ణించారు. “ఈ సమగ్ర భాగస్వామ్యం భారత సెమీకండక్టర్ ప్రయాణానికి పూర్తిగా సరికొత్త గమనాన్నీ, వేగాన్నీ ఇవ్వబోతోంది” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

గత రెండేళ్ళ మూడు నెలల కాలంలో సాధించిన అపారమైన పురోగతిని ప్రస్తావిస్తూ, ఏటా 20 కోట్ల యూనిట్లను సరఫరా చేయగల సామర్థ్యం ఉన్న వాణిజ్యపరమైన ఉత్పత్తి దశకు చేరుకోవడాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు.

# వినియోగదారుల ఫిర్యాదుల పూర్తి ప్రక్రియను డిజిటలీకరణ చేసే ఈ-జాగృతి విధానాన్ని వివరించే కథనాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 6:వినియోగదారుల ఫిర్యాదులకు సంబంధించిన పూర్తి ప్రక్రియను డిజిటలైజ్ చేయటం ద్వారా వివిధ సవాళ్లను ‘ఈ-జాగృతి’ ఎలా పరిష్కరిస్తుందనే అంశంపై కేంద్రమంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి రాసిన కథనాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు. “వాటాదారులతో విస్తృత సంప్రదింపుల తర్వాత ‘ఈ-జాగృతి’ మరింత మెరుగైందని, దీని ద్వారా వినియోగదారుల న్యాయ వ్యవస్థ కూడా డిజిటల్ సంస్కరణల దిశగా అడుగుల వేస్తోందని ఆయన ఈ కథనం ద్వారా వెల్లడించారు” అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

వినియోగదారుల ఫిర్యాదులకు సంబంధించిన పూర్తి ప్రక్రియను డిజిటలైజ్ చేయటం ద్వారా వివిధ సవాళ్లను ‘ఈ-జాగృతి’ ఎలా పరిష్కరిస్తుందనే అంశాన్ని కేంద్రమంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ఈ కథనంలో వివరించారు. వాటాదారులతో విస్తృత సంప్రదింపుల తర్వాత ‘ఈ-జాగృతి’ మరింత మెరుగైందని తెలిపారు.

# రాజస్థాన్‌లోని బలోత్రాలో 1.06 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం..

## దేశానికి అంకితం.. శంకుస్థాపన చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జులై 6: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ రాజస్థాన్‌లోని బలోత్రాలో 1.06 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయడంతోపాటు మరికొన్నిటిని దేశానికి అంకితం చేశారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడాన్ని అభినందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు వారి నిరంతర సహకార స్ఫూర్తిని కొనియాడారు. మండే వేసవిలో మలమలమాడ్చే ఎండలో ఇంద పెద్ద సంఖ్యలో హాజరయ్యారంటూ ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వానికి లభించిన అఖండ ఆమోదానికి ఈ భారీ జనసందోహమే నిదర్శనమని ప్రధానమంత్రి అభివర్ణించారు. "మా ప్రభుత్వ కృషిపై మీ తిరుగులేని విశ్వాసాన్ని చాటే ఈ అపార ఆదరాభిమానాలకుగాను ఈ రాజస్థాన్ గడ్డకు నేనెంతో రుణపడి ఉంటాను'' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఈ ప్రాంత చారిత్రక వారసత్వాన్ని గుర్తుచేస్తూ- ఈ గడ్డపై జన్మించిన అసంఖ్యాక సాహస వీరులకు ప్రధానమంత్రి నివాళి అర్పించారు. నిజమైన జాతీయ ప్రతిష్ఠ అంతర్లీనంగా స్వావలంబనతో ముడిపడి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. వ్యక్తిగత గౌరవానికీ, విదేశాలపై పరాధీన తగ్గించుకోవాలన్న వ్యూహాత్మక అవసరానికీ మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని ప్రస్తావించారు. ఈ మేరకు "ఒక వ్యక్తి లేదా దేశం ఆత్మగౌరవం పూర్తిగా స్వావలంబనతో ముడిపడి ఉంటేనే అది సమున్నతంగా నిలవగలదు'' అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా భారీ రాజస్థాన్ చమురుశద్ధి కర్మాగారాన్ని దేశానికి అంకితం చేశారు. దేశ సర్వతో ముఖాభివృద్ధి, ఆర్థిక స్వాతంత్ర్యం దిశగా భారత్ విస్తృత లక్ష్యాల సాధనకు సారథ్యం వహించడంలో దాని కీలక పాత్రను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. "ఈ భారీ రిఫైనరీ వేలాది ప్రజలకు శాశ్వత ఉపాధి మాధ్యమంగా ఉపయోగపడుతుంది. ఈ ఘనతను సొంతం చేసుకున్న రాజస్థాన్ యువతను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను'' అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాలన, పని సంస్కృతిలో వచ్చిన సమూల మార్పులను స్పష్టం చేస్తూ- అభివృద్ధి ప్రాజెక్టులను పునాది రాళ్లకు పరిమితం చేసిన గత ప్రభుత్వాలతో పోలిస్తే, తమ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులన్నింటినీ నిర్విరామంగా పూర్తి చేస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఓ రెండు నెలల కిందట ఈ ప్రదేశంలో సంభవించిన దురదృష్టకర ప్రమాదాన్ని గుర్తుచేస్తూ- గడ్డు పరిస్థితుల నడుమ ఈ భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టును అసాధారణ వేగంతో పూర్తి చేయడంలో కార్మికుల అవిరళ కృషిని, పట్టుదలను ఆయన ప్రశంసించారు. ''సవాలు ఎంతటి సంక్లిష్టం.. అనూహ్యమైనదైనా సంకల్ప సాధనలో 'నవ భారత్' ఎన్నడూ వెనక్కు తగ్గదు, వేగం తగ్గించదు'' అని శ్రీ మోదీ ఆత్మవిశ్వాసం ప్రకటించారు.

రాష్ట్రంలో వేగంగా సాధించిన విజయాలను వివరిస్తూ- ముందుగా జోధ్‌పూర్‌లో కొత్త విమానాశ్రయ టెర్మినల్ ప్రారంభోత్సవాన్ని ఆయన ప్రస్తావించారు. మారుమూల ప్రాంతాలకు విమాన సంధానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే కొత్త 'ఉడాన్' పథకం తొలిదశ ప్రారంభాన్ని ప్రధానమంత్రి సగర్వంగా ప్రకటించారు. విమానయాన రంగంలో ఈ ప్రగతితోపాటు షెఖావతి ప్రాంతంలో జల సంక్షోభానికి త్వరలోనే ముగింపు పలుకుతామని ఆయన భరోసా ఇచ్చారు. జైపూర్ మెట్రో నెట్‌వర్కును భారీ స్థాయిలో విస్తరిస్తామని వాగ్దానం చేశారు. "ఈ కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో మార్వార్ ప్రాంతమంతటా పర్యాటకం, వాణిజ్యం, ఉపాధి రంగాలకు ప్రాధమికంగా నవ్యోత్తేజం లభిస్తుంది'' అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

యువతకు సాధికారత, పరిపాలన సామర్థ్యం దిశగా భారీ ప్రోత్సాహంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 54,000 మంది యువతకు ప్రభుత్వోద్యోగ నియామక పత్రాల పంపిణీని ప్రధానమంత్రి లాంఛనంగా ప్రకటించారు. నేటినుంచి వారు అధికారికంగా తమ కీలక ప్రజాసేవా కర్తవ్య నిర్వహణకు శ్రీకారం చుడుతున్నారంటూ అభినందనలు తెలిపారు. "నేడు నియామక పత్రాలు స్వీకరిస్తున్న యువత భవిష్యత్తు అత్యంత ఉజ్వలం, సుసంపన్నం కావాలని ఆకాంక్షిస్తున్నాను'' అని శ్రీ మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

భౌగోళిక రాజకీయ పరిస్థితుల వైపు దృష్టి సారిస్తూ- పశ్చిమాసియాలో వినాశకర సంఘర్షణ పరిణామాలను ఆయన ప్రస్తావించారు. దానివల్ల ఏర్పడిన అస్థిరత ప్రపంచాన్ని ఎంతటి దుస్థితిలోకి నెట్టిందో ప్రధాన మంత్రి వివరించారు. ఈ పరిస్థితిని 21వ శతాబ్దపు అత్యంత తీవ్ర ఇంధన సంక్షోభంగా ఆయన అభివర్ణించారు. దీనివల్ల అభివృద్ధి చెందిన ప్రధాన దేశాలు కూడా తీవ్ర ఇంధన కొరతతో సతమతం అయ్యాయని పేర్కొన్నారు. "పశ్చిమాసియాలో యుద్ధం ఫలితంగా ప్రపంచమంతటా ఆందోళనకర పరిస్థితులు తలెత్తాయి. పర్యవసానంగా ప్రధాన దేశాలు కూడా ఇంధన కొరతతో తల్లడిల్లుతున్నాయి'' అని శ్రీ మోదీ వివరించారు.

అయితే, భారత్ ఈ అంతర్జాతీయ నిస్పృహకు భిన్నంగా పరిస్థితులను ఎదురొడ్డి నిలిచిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మన దృఢమైన పునరుత్థాన శక్తితో ఆర్థిక వ్యవస్థను విజయవంతంగా కాపాడుకున్నామని తెలిపారు. పరిస్థితులను సకాలంలో, కచ్చితంగా అంచనా వేస్తూ, ప్రతి స్థాయిలో సరైన నిర్ణయాలతో సమర్థ వ్యూహాలను రూపొందించుకున్నామని చెప్పారు. అలాగే, వనరుల సమతుల వినియోగం, సానుకూల దౌత్యశక్తితో సంక్షోభం నుంచి గట్టెక్కామని తెలిపారు. ఆ విధంగా ప్రపంచవ్యాప్త ప్రకంపనలను నవ భారత్ తిరుగులేని సంకల్ప బలంతో అధిగమించిందని ఆయన స్పష్టం చేశారు. "భారత్ ప్రతి దశలోనూ సముచిత నిర్ణయాలు తీసుకుంటూ సంక్షోభ తీవ్రతను సకాలంలో నిర్దిష్టంగా అంచనా వేసింది. ఆ గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కడంలో దౌత్య శక్తిని సద్వినియోగం చేసుకుంది'' అని శ్రీ మోదీ విశదీకరించారు.

పశ్చిమాసియా సంక్షోభ సమయంలో వదంతులు, భయాందోళనలు వ్యాప్తి చేసిన వారి తీరును ప్రధానమంత్రి ఖండించారు. అయితే, సంక్షోభ పరిణామాలను ఎదుర్కోవడంలో రాత్రింబవళ్లు నిశ్శబ్దంగా సాగిన అసాధారణ పరిపాలనా కృషి, వ్యూహరచన, సునిశిత దౌత్య చర్యలను ఆయన ప్రశంసించారు. ''కొన్ని శక్తులు వదంతుల వ్యాప్తిలో నిమగ్నమైనపుడు పరిస్థితిని చక్కదిద్దడంలో విధాన, దౌత్య స్థాయిలలో తీసుకున్న సునిశిత చర్యలు అద్భుతం'' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

దేశం సమష్టి కృషితో గట్టెక్కిన ఈ విపత్తు స్థాయిని వివరిస్తూ- పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు భారత్ తన ఎల్‌పీజీ అవసరాల్లో 60 శాతం మేర దిగుమతులపై ఆధారపడి ఉందని గుర్తుచేశారు. అందులో 90 శాతం ప్రత్యేకించి అత్యంత అస్థిర గల్ఫ్ ప్రాంతం నుంచే వస్తాండేదని ప్రధానమంత్రి వెల్లడించారు. అయితే, అకస్మాత్తుగా యుద్ధం ప్రారంభమై ఆ కీలక సరఫరా మార్గం మూతపడటంతో దేశంలో ఎలాంటి తీవ్ర భయాందోళనలు రేగాయో కళ్లకు కట్టినట్లు వివరించారు. "యుద్ధ పరిస్థితితో ఆ కీలక సరఫరా స్తంభించినపుడు దేశీయంగా ఎంతటి భారీ నిరసనలు రేగి ఉండేవో మీరు సులభంగా ఊహించవచ్చు'' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

అంతటి సంక్షోభ పరిస్థితుల నడుమ ప్రభుత్వం అమలు చేసిన అత్యవసర నివారణ చర్యలను ప్రధానమంత్రి వివరించారు. పారిశ్రామిక కార్యకలాపాలకు ఉద్దేశించిన గ్యాస్‌ను నేరుగా గృహ వినియోగం కోసం వంటగ్యాస్ (ఎల్‌పీజీ)గా మలచేందుకు దేశీయ చమురుశుద్ధి కర్మాగారాలను ఎంతో వేగంగా పునర్వ్యవస్థీకరించామని తెలిపారు. కేవలం వారంలోగా ఈ వ్యూహాత్మక మార్పులు చేపట్టడంతో జాతీయ ఎల్‌పీజీ ఉత్పాదన 35,000 టన్నుల నుంచి 54,0 00 టన్నులకు పెరిగిందని ఆయన సగర్వంగా ఉటంకించారు. "మన రిఫైనరీలపై చురుగ్గా దృష్టి సారించడం ద్వారా మునుపెన్నడూ లేని స్థాయిలో ఎల్‌జీపీ ఉత్పత్తి చేయని ప్లాంట్లను కూడా ఈ సవాలును ఎదుర్కొనేలా వేగంగా సిద్ధం చేశాం'' అని శ్రీ మోదీ వివరించారు.

వినియోగదారు పరిరక్షణ దిశగా సమగ్ర వ్యూహం అమలు చేశామని, సంప్రదాయ సిలిండర్ గ్యాస్‌కు గల భారీ జాతీయ డిమాండ్ తగ్గింపు నిమిత్తం 'పీఎన్‌జీ' (పైపుల ద్వారా సహజ వాయువు) కనెక్షన్లను వేగంగా పెంచామని ప్రధానమంత్రి వెల్లడించారు. అతి తక్కువ సమయంలోనే ప్రభుత్వం 11 లక్షలకు పైగా గృహాలను పైపుల నెట్‌వర్క్‌తో విజయవంతంగా సంధానించిందని గుర్తుచేశారు. "వంటగ్యాస్ డిమాండ్ భారం మొత్తం ఒక్క ఎల్‌పీజీ పైనే పడకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ ప్రదర్శించింది'' అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

దేశ పౌరులపై ఆర్థిక భారం పడకుండా చేపట్టిన ఆర్థికపరమైన చర్యలను ప్రధానమంత్రి వివరించారు. దేశీయంగా సిలిండర్ ధరలు రూ.2,000కు చేరవచ్చునని మార్కెట్ నిపుణులు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. కానీ, ప్రభుత్వం సిలిండర్ ధరను రూ.950 దాటకుండా కఠిన నియంత్రణ చర్యలు తీసుకున్నదని తెలిపారు. ముఖ్యంగా పేదలకు మంజూరు చేసే ఉజ్వల సిలిండర్ల ధరను రూ.650కన్నా తక్కువకే అందించిందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల రెండు రోజుల కిందటే వాణిజ్య గ్యాస్ ధరను కూడా తగ్గించిందని తెలిపారు. "దేశీయ వినియోగదారులపై భారీ భారం పడకుండా చూడటంలో మా ప్రభుత్వం ఎంత సునిశితంగా వ్యవహరించిందో ధరల నియంత్రణ చర్యలు స్పష్టం చేస్తున్నాయి'' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరగడంతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో భారీ స్థాయిలో స్వదేశీ చమురు నిల్వలూ లేని పరిస్థితిని ప్రధానమంత్రి ప్రజలకు గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా ధరలు 40 నుంచి 50 శాతం వరకు పెరగడంతో అనేక దేశాలు రేషన్ విధానంలో ఇంధనం పంపిణీ చేశాయని ఆయన ప్రస్తావించారు. ''దిగుమతి మార్గాలు మూసుకుపోవడం వల్ల ప్రపంచంలోని అనేక దేశాల్లో డీజిల్, పెట్రోల్ పంపిణీని కోటా పద్ధతిలో కఠినంగా చేపట్టాల్సి వచ్చింది'' అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

పెరిగిన ధరల భారం నుంచి పౌరులను రక్షించడం కోసం కేంద్ర ప్రభుత్వం భరించిన ఆర్థిక భారాలను ప్రధానమంత్రి వివరించారు. కేవలం ఏప్రిల్-జూన్ కాలంలోనే ప్రభుత్వం 75,000 కోట్ల రూపాయలకు పైగా భారీ నష్టాన్ని భరించిందని ఆయన వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లోనూ ఇంధన సరఫరాకు అంతరాయం కలగకుండా, సరసమైన ధరలకే అందుబాటులో ఉండేలా చూసేందుకు లీటరుకు 10 రూపాయల చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని తీసుకున్న నిర్ణయం గురించి ఆయన వివరించారు. "దేశంలో ఏ ఒక్క రోజూ తీవ్రమైన కొరత పరిస్థితులు తలెత్తలేదు. ప్రజలపై అధిక భారం పడకుండా మేం చూసుకున్నాం'' అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

తీవ్రమైన సరఫరా కొరతను అధిగమించడంలో భారత్ అనుసరించిన పటిష్ఠమైన, చురుకైన విదేశాంగ విధానమే కీలకమని ప్రధానమంత్రి శ్రీ మోదీ పేర్కొన్నారు. కేవలం 25-26 దేశాల నుంచి 40కి పైగా దేశాలకు ఇంధన దిగుమతులను విస్తరించుకోవడం కోసం దేశం తన దౌత్య పలుకుబడిని వ్యూహాత్మకంగా ఎలా ఉపయోగించుకుందో ఆయన వివరించారు. ఈ నిర్ణయాత్మక ఎత్తుగడ అంతర్జాతీయ సమాజానికి ఒక శక్తిమంతమైన, తిరుగులేని సందేశాన్ని అందించిందని ఆయన స్పష్టం చేశారు. "మాకు జాతీయ ప్రయోజనాలు, పౌరుల సంక్షేమమే సర్వస్వం అనే స్పష్టమైన సందేశాన్ని యావత్ ప్రపంచానికీ భారత్ అందించింది'' అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లోనూ మన దేశం సమర్థంగా ముందుకు సాగడానికి గత దశాబ్ద కాలంగా అత్యంత దూరదృష్టితో సాగిన విధాన రూపకల్పనేనని మూల కారణమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాజస్థాన్ రిఫైనరీ పనులు వేగంగా పూర్తికావడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలోని గత ప్రభుత్వ సహాయ నిరాకరణ కారణంగా 2018 నుంచి 2023 మధ్య ఈ ప్రాజెక్టు పనులు పూర్తిగా స్తంభించిపోయాయన్నారు. ప్రస్తుత డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రిఫైనరీ పనులను వేగంగా పూర్తి చేసిందని ప్రధానమంత్రి తెలిపారు. దీనికి సంబంధించి 2017లోనే అవగాహన ఒప్పందం కుదిరిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. "ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు వేగంగా సాగాయి, ఈ రోజు మనం దీనిని దేశానికి అంకితం చేస్తున్నాం'' అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయిలో భారత పారిశ్రామిక వృద్ధిని విశ్లేషిస్తూ, గత 50 ఏళ్లుగా అమెరికాలో కొత్తగా ఎలాంటి రిఫైనరీ (చమురు శుద్ధి కర్మాగారం) నిర్మాణం జరగలేదన్నారు. ఈ రంగంలో ఐరోపా సామర్థ్యమూ తగ్గుతోందని ప్రధానమంత్రి ప్రస్తావించారు. అదే సమయంలో, ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రిఫైనరీ సామర్థ్యాన్ని కలిగి ఉండే స్థాయికి భారత్ ఎదగడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యూహాత్మక సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. "ఈ అవిశ్రాంత కృషి కారణంగా శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ సమర్థంగా ఎదుర్కొని, దాని నుంచి పూర్తిగా కోలుకోగలిగింది'' అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంలోని ఇబ్బందులను గురించి ప్రస్తావిస్తూ, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఏర్పడిన తీవ్రమైన ఎరువుల కొరత వల్ల ప్రపంచవ్యాప్తంగా యూరియా ధరలు బస్తాకు 3,000 రూపాయలకు పైగా పెరిగాయని ప్రధానమంత్రి వివరించారు. లక్షల కోట్ల రూపాయల రాయితీల ద్వారా కేవలం 300 రూపాయలకే మన రైతులకు యూరియాను అందించామన్నారు. ప్రపంచ స్థాయిలో ప్రత్యామ్నాయ మార్గాలను సురక్షితం చేసే బాధ్యతను రాయబార కార్యాలయాలకు అప్పగించామని ఆయన తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని దూకుడుగా ప్రోత్సహించడం వంటి భారీ బహుముఖ రక్షణ చర్యలను వివరిస్తూ... అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ''విస్తృతమైన రాయితీలు, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాల ద్వారా... మన రైతులకు అత్యంత కీలకమైన యూరియాను అతి తక్కువ ధరలకే అందేలా చూసుకున్నాం'' అని శ్రీ మోదీ ధ్రువీకరించారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న పరిశ్రమలను (ఎంఎస్‌ఎంఈలను) రక్షించడం అత్యంత కీలకమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. రోజురోజుకూ విపరీతంగా పెరుగుతున్న వ్యాపార నిర్వహణ ఖర్చుల నుంచి ఈ ఎంఎస్‌ఎంఈలను కాపాడేందుకు గానూ ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ (ఈసీఎల్‌జీఎస్) తదుపరి దశను వ్యూహాత్మకంగా అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. 100 శాతం ప్రభుత్వ హామీతో బ్యాంకుల ద్వారా అదనంగా 20 శాతం రుణాన్ని సులభతరం చేయడం ద్వారా... చిన్న, కుటీర పరిశ్రమలను ఆర్థిక పతనం నుంచి సమర్థంగా రక్షించగలిగామని ఆయన పేర్కొన్నారు. "ఇలాంటి అనేక కీలక ఆర్థిక చర్యల ప్రత్యక్ష ఫలితం కారణంగానే దేశంలోని చిన్న, భారీ పరిశ్రమలు ఈ రోజు పూర్తి సురక్షిత భావనతో ఉన్నాయి'' అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

దేశంలోని 140 కోట్ల మంది పౌరులకు కృతజ్ఞతలు తెలుపుతూ... ప్రభుత్వం, ప్రజల మధ్య బలమైన పరస్పర విశ్వాసమే దేశ సమష్టి స్థిరత్వానికి కారణమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. కష్ట సమయాల్లోనూ అసాధారణ రీతిలో దృఢంగా నిలబడినందుకు, భయాన్ని వ్యాప్తి చేసే దురుద్దేశపూర్వక కుట్రలను చురుగ్గా ఓడించినందుకు, అంతిమంగా భారత్ విఫలమవుతుందని ఆత్రుతగా ఆశించిన వర్గాలను నిరాశపరిచినందుకు ఆయన ప్రజలను ప్రశంసించారు. "మన అద్భుతమైన, దృఢమైన పౌరుల అచంచల విశ్వాసం, అపారమైన సామర్థ్యాల బలంతోనే క్లిష్ట పరిస్థితుల్లోనూ దేశం విజయవంతంగా ముందుకు సాగింది'' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ప్రధాన మౌలిక సదుపాయాల అభివృద్ధిని పర్యావరణ బాధ్యతతో అనుసంధానిస్తూ... ఎడారి విస్తరణను నివారించడంలో కీలక పాత్ర పోషించే అద్భుతమైన, పవిత్రమైన ఖేజ్రీ మొక్కను నాటే అవకాశం లభించడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా ప్రధాన మంత్రి పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధనాల దిశగా వస్తున్న వేగవంతమైన మార్పును వివరిస్తూ... ప్రపంచ స్థాయి సోలార్ పార్కుల ఏర్పాటు, పీఎం సూర్య ఘర్ పథకం కింద 1.5 లక్షలకు పైగా గృహాల అనుసంధానం, పీఎం కుసుమ్ యోజన ద్వారా స్థానిక రైతులకు 65,000కు పైగా సోలార్ పంపుల పంపిణీ వంటి అంశాలను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. "ఈ మొక్కను నాటడం మన ప్రధాన కార్యాచరణ సంస్కృతికి చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. మన పర్యావరణాన్ని కచ్చితత్వంతో పరిరక్షిస్తూనే, ప్రగతిలో కొత్త శిఖరాలను చేరుకోవాలనే మన సంకల్పానికి ఇది స్ఫూర్తినిస్తుంది'' అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

దీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రాంతీయ జల వివాదాలకు చారిత్రాత్మక పరిష్కారాన్ని ప్రస్తావిస్తూ... రాజస్థాన్‌లోని తీవ్ర నీటి కొరతను విస్మరించిన గత ప్రభుత్వాలను ప్రధానమంత్రి తీవ్రంగా విమర్శించారు. దీనికి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న 'దేశమే ప్రథమం' అనే సహకార విధానాన్ని ఆయన ఉదహరించారు. రాజస్థాన్‌లోని గ్రామాల కోసం గుజరాత్ స్వచ్ఛందంగా నర్మదా మాత జలాలను పంచుకున్న చరిత్రాత్మక సందర్భాన్ని ఆయన ఉదహరించారు. "ఉద్దేశాలు స్వచ్ఛంగా ఉన్నప్పుడు, దశాబ్దాలుగా ఉన్న వివాదాలనూ సులభంగా పరిష్కరించుకోవచ్చు'' అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

రాజస్థాన్, హర్యానా ప్రభుత్వాల మధ్య రూ. 34,000 కోట్ల విలువైన చరిత్రాత్మక ఒప్పందాన్ని సగర్వంగా ప్రకటిస్తూ... హత్నికుండ్ బ్యారేజీ నుంచి భూగర్భ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసే ప్రణాళికను ప్రధానమంత్రి వివరించారు. ఈ అపూర్వమైన పరస్పర అంగీకారం సికార్, చురు, ఝున్‌ఝును సహా మొత్తం షెఖావతీ ప్రాంతంలోని లక్షలాది మంది నివాసితులకు ప్రాణాధారమైన నీటిని సమర్థంగా అందిస్తుందని ఆయన తెలిపారు.

## క్యాతన్‌పల్లి 9వ వార్డులో మంత్రి వివేక్ మార్నింగ్ వాక్



ఆదిలాబాద్, జులై 6:క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి సోమవారం మార్నింగ్ వాక్ నిర్వహించారు. గద్దరాగడి శ్రీనివాస గార్డెన్ ఏరియా నుంచి మార్నింగ్ వాక్ ప్రారంభించిన మంత్రి, వార్డులోని పలు వీధుల్లో కాలినడకన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఆప్యాయం గా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వార్డులో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వంటి మౌలిక వసతులపై ప్రజలు చేసిన వినతులను మంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి వివేక్, "ప్రజలకు అందుబాటులో ఉండటమే ప్రజాప్రతినిధుల ప్రథమ బాధ్యత. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేస్తాం'' అని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్ర తినిధులు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారు లు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు దుస్తుల పంపిణీ..




నిజామాబాద్, జులై 6: భీమ్‌గల్ మండలంలోని బాబాపూర్ గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఉచితంగా దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సమీర్ హాజరై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎడ్ల శేఖర్ తో కలిసి విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాటాడుతూ,చిన్నారుల ఆరోగ్యం, పరిశుభ్రత, నాణ్యమైన ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ ప్రజలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.చిన్నారులు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరై పోషకాహారంతో పాటు ప్రాథమిక విద్యను అభ్యసించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంద గోవర్ధన్,పంచాయతీ కార్యదర్శి సంతోష్, పాలకవర్గ సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉల్లి కొనుగోలు ధరను 13 శాతం పెంచి క్వింటాల్‌కు రూ. 2,125 చేసిన కేంద్రం...

న్యూ ఢిల్లీ, జులై 6:ధరల స్థిరీకరణ, బఫర్ నిల్వల కోసం సేకరించే ఉల్లిపాయల కొనుగోలు ధరను కేంద్ర ప్రభుత్వం 13 శాతం పెంచింది. దీని ప్రకారం గతంలో ఉన్న క్వింటాల్ ధర రూ. 1,875 నుంచి ఇప్పుడు రూ. 2,125కు పెరిగింది. ఈ సవరించిన కొత్త కొనుగోలు ధర 2026 జులై 4 (నేటి) నుంచి తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం నాఫెడ్ (ఎన్ఏఎఫ్ఈడీ), ఎన్‌సీసీఎఫ్ సంస్థల ద్వారా ప్రభుత్వ బఫర్ నిల్వల కోసం ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈ ధరల పెంపు నిర్ణయం వల్ల ఉల్లి రైతులకు వారి పంటపై మెరుగైన లాభాలు అందడమే కాకుండా, ప్రభుత్వ బఫర్ నిల్వల సేకరణ ప్రయత్నాలకు మరింత ఊతం లభిస్తుంది.

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ విడుదల చేసిన 2025-26 ఆర్థిక సంవత్సరపు రెండో ముందస్తు అంచనాల ప్రకారం... దేశంలో ఉల్లి ఉత్పత్తి దాదాపు 307.37 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా వేశారు. ఇది గత ఏడాది (2024-25) నమోదైన 307.67 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో సమానంగా ఉంది. ఈ ఉత్పత్తి అంచనాల ప్రకారం ప్రస్తుత దశలో దేశంలో ఉల్లిపాయల లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అయితే సాధారణ సీజన్లవారీగా జరిగే మార్పుల మార్కెట్ ధోరణికి అనుగుణంగా ధరలు కొద్దిగా పెరిగే అవకాశం ఉంది.

ప్రస్తుతం దేశంలో ఉల్లిని ఎక్కువగా పండించే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో నిల్వలు సరిపడినంతగా ఉన్నాయి. నిల్వ ఉంచిన ఉల్లిపాయలకు ఎలాంటి కొరత లేదు.

దేశవ్యాప్తంగా రోజువారీ మార్కెట్లకు ఉల్లి రాక 50,000 మెట్రిక్ టన్నులకు పైగా బలంగా సాగుతోంది. ఇందులో ఒక్క మహారాష్ట్ర నుంచే 30,000 మెట్రిక్ టన్నుల ఉల్లి మార్కెట్లకు వస్తోంది. ప్రస్తుతం మార్కెట్లలో సగటు మోడల్ ధర కేజీకి సుమారుగా రూ. 18 రూపాయలుగా ఉంది. మెరుగైన నాణ్యత కలిగిన ఉల్లి నిల్వలు ఇంకా నిల్వ కేంద్రాలలోనే భద్రంగా ఉన్నాయి. వీటిని డిమాండు ఎక్కువగా ఉండే, సరఫరా తక్కువగా ఉండే కాలంలో మార్కెట్లోకి విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సగటు రీటెయిల్ ధర కిలోకు రూ.31గా కొనసాగుతోంది.

కొన్ని ప్రాంతాల్లో రుతుపవనాల రాక ఆలస్యం కావడం, సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో కొంతమంది వ్యాపారులు ముందస్తు అంచనాలతో కొనుగోళ్లు జరుపుతున్నారు. ప్రధాన వినియోగ కేంద్రాల్లో ప్రస్తుత ధరల వద్ద పెద్దగా డిమాండు ఏమీ కనిపించడం లేదు. వినియోగదారుల మార్కెట్లలో ఇలాంటి పరిస్థితి ఉన్నప్పటికీ.. నాసిక్, మధ్యప్రదేశ్‌లోని కొన్ని ఉత్పత్తి కేంద్రాలలో భవిష్యత్తులో మార్కెట్ పుంజుకుంటుందనే అంచనాలతోనే ఈ విధమైన వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి తప్ప, క్షేత్రస్థాయిలో బలమైన డిమాండ్ వల్ల మాత్రం కాదు.

దేశం నుంచి ఉల్లి ఎగుమతులు ప్రస్తుతం సాధారణంగానే సాగుతున్నాయి. 2026 జూన్ నెలలో దాదాపు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లి ఎగుమతి అయింది. గల్ఫ్ దేశాలు, శ్రీలంక, సుదూర తూర్పు ఆసియా దేశాలు వంటి ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలలో పాకిస్తాన్, చైనా దేశాల నుంచి కొత్త పంట పోటీ ధరలకే లభిస్తుండటం వల్ల.. రాబోయే కొద్దిరోజుల పాటు భారత్ నుంచి ఉల్లి ఎగుమతుల వేగం స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు.

మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలో ఖరీఫ్ ఉల్లి సాగు దాదాపు 15 రోజులు ఆలస్యమైనట్లు నివేదికలు చెబుతున్నాయి. మరోవైపు కర్ణాటకలోని చిత్రదుర్గ, చల్లకేరె ప్రాంతాల్లో ఖరీఫ్ సాగు ఇప్పటివరకు సాధారణ విస్తీర్ణంలో సుమారు 60 శాతానికి చేరుకున్నట్లు అంచనా వేస్తున్నారు.

# ఇ20 ఒక పరిశుభ్ర... అత్యుత్తమ పనితీరు గల ఇంధనం

న్యూఢిల్లీ, జులై 6:పెట్రోలులో ఇథనాల్ మిశ్రణం ఒక ప్రణాళికాబద్ధ, శాస్త్రీయ, దశలవారీ ప్రక్రియ కాబట్టి, ఇ20 మిశ్రమ ఇంధనంపై ఆందోళన పడవద్దని వాహన యజమానులకు కేంద్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఈ మేరకు పెట్రోలియం-సహజ వాయువులు, భారీ పరిశ్రమలు, రోడ్డు రవాణా-రహదారుల మంత్రిత్వ శాఖలు న్యూఢిల్లీలో ఇవాళ విలేకరుల సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఇంధన, ఆటోమొబైల్ రంగాల్లోని ప్రసిద్ధ నిపుణులు ఇ20 మిశ్రణ కార్యక్రమంపై ప్రసంగించారు.

ఈ సమావేశంలో ప్రసంగించిన వారిలో- ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్) మాజీ చైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి వర్తికా శుక్లా, టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) కంట్రీ హెడ్-ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ విక్రమ్ గులాటీ, మారుతి సుజుకి కార్పొరేట్ వ్యవహారాల సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ రాహుల్ భారతి, హీరో మోటోకార్ప్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శ్రీ అశుతోష్ వర్మ, టీవీఎస్ మోటార్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ ప్రసాద్ కృష్ణన్, హ్యుందాయ్ మోటార్ ఇండియా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ పునీత్ ఆనంద్, బజాజ్ ఆటో లిమిటెడ్ అర్బనైట్ బిజినెస్ సర్కిల్ హెడ్-సేల్స్ (నార్త్ అండ్ ఈస్ట్) శ్రీ మన్‌ప్రీత్ సింగ్ బింద్రా తదితరులున్నారు.

ముందుగా శ్రీ విక్రమ్ గులాటీ మాట్లాడుతూ- అత్యంత కఠిన నియంత్రిత రంగాల్లో ఆటోమోటివ్ పరిశ్రమ ఒకటని పేర్కొన్నారు. వాహనాలను మార్కెట్లోకి ప్రవేశపెట్టే ముందు-తర్వాత కూడా స్వతంత్ర-అంతర్జాతీయ గుర్తింపు గల సంస్థల ద్వారా కఠిన నాణ్యత పరీక్షలు నిర్వహిస్తామని ఆయన గుర్తు చేశారు. ఈ క్రమంలో ఇథనాల్ అత్యుత్తమ పనితీరు గల, పరిశుభ్ర ఇంధనంగా తేలిందని, వాస్తవానికి ఇది 1900 ప్రారంభం నుంచి ఫార్ములా రేసింగ్‌లోనూ వాడుకలో ఉందని వివరించారు. పాత వాహనాలపై కఠిన పరీక్షల అనంతరమే ఇ20కి మారడంపై నిర్ణయం తీసుకున్నామన్నారు. అయితే, ఇటీవల ప్రారంభించిన ఇ85 విక్రయ కేంద్రాలు ప్రత్యేకించి పూర్తి మిశ్రమ ఇంధన (ఫ్లెక్స్ ఫ్యూయల్) వాహనాల కోసమేనని, భవిష్యత్ విధానానికి ఇది దిశానిర్దేశం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

పరీక్షా సంస్థల స్వతంత్ర ప్రతిపత్తిపై ప్రశ్నలకు జవాబిస్తూ- సంబంధిత విధివిధానాలు ఒక్క భారత్ మాత్రమే నిర్దేశించినవి కావని, శ్రీ గులాటి వెల్లడించారు. భారత్ 'యూఎన్‌ఈసీఈ' సభ్య దేశం కాబట్టి, సదరు పరీక్ష విధానాలకు అంతర్జాతీయ ప్రామాణీకరణ ఉన్నదని పేర్కొన్నారు. తదనుగుణంగా పరీక్షా సంస్థలు తగిన గుర్తింపుతో ప్రపంచమంతటా నిబంధనల మేరకు పనిచేస్తున్నాయని చెప్పారు. అలాగే, ఇతర దేశాలకు ఎగుమతి చేసే వాహనాలకూ ఈ పరీక్షలు నిర్వహిస్తారని, ఈ విధివిధానాల్లో రాజీపడే ప్రస్తక్తే ఉండదని ఆయన స్పష్టం చేశారు.

అనంతరం శ్రీ రాహుల్ భారతి మాట్లాడుతూ- ఇ10 కోసం రూపొందించిన వాహనాలను అన్ని పారామితుల నడుమ ఇ20 ఇంధనంతో పరీక్షించామని, ఆందోళన కలిగించే అంశాలేవీ లేవని వినియోగదారులకు "విశ్వాస ప్రకటన" చేశారు. దీనిపై వివరణనిస్తూ- 2025-26లో మారుతి సుజుకి సర్వీసింగ్ చేసిన 2.84 కోట్ల కార్లలో, 1.5 కోట్లకు పైగా మూడేళ్లకన్నా పాతవని గుర్తుచేశారు. వాటికి ఇ20 సర్టిఫికేషన్ లేకపోయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇ20 సంబంధిత తుప్పు, అరుగుదల, విడిభాగాల జీవితకాలం తగ్గడం వంటి సమస్యలేవీ కనిపించలేదన్నారు.

ఇక మైలేజీ విషయానికొస్తే- ఇ10తో పోలిస్తే ఇ20 కెలోరిఫిక్ విలువ 3 నుంచి 3.5 శాతం తక్కువగా ఉంటుంది కాబట్టి, మైలేజీపై ప్రభావం కూడా అంతవరకే పరిమితమని శ్రీ భారతి వివరించారు. అంటే- లీటరుకు 20 కిలోమీటర్ల మైలేజీ సామర్థ్యంగల కారుపై ప్రభావం సుమారు 0.6 కిలోమీటర్ల స్థాయిలో మాత్రమే తగ్గుతుందన్నారు. కానీ, టైర్లలో గాలి ఒత్తిడి, డ్రైవింగ్ విధానం, గేర్ల సముచిత వాడకం, వేగం, బ్రేకింగ్, నిర్వహణ వంటి అంశాలు కూడా మైలేజీలో ఎక్కువ వ్యత్యాసానికి కారణం కాగలవన్నారు. స్వచ్ఛమైన పెట్రోలుతో పోలిస్తే ఇథనాల్ విషయంలో మెరుగైన వేగం, యాంటీ నాకింగ్, స్వల్ప కాలుష్యం వంటి సానుకూలతలతో ఆ కొద్దిపాటి మైలేజీ నష్టం పూర్తిగా భర్తీ అవుతుందని విశ్లేషించారు.

ఇ20 నిబంధనలకు మించిన భద్రత ప్రమాణాలతో వాహనాలను రూపొందించారని, ప్రస్తుతం మార్కెట్లో ఎలాంటి 'రెట్రోఫిట్‌మెంట్ కిట్' అందుబాటులో లేదని చెప్పారు. కాబట్టే, అటువంటి పరిష్కారాలు పరిశోధన-అభివృద్ధికి మాత్రమే పరిమితమైనట్లు ఆయన స్పష్టం చేశారు.

అటుపైన శ్రీమతి వర్తికా శుక్లా ప్రసంగిస్తూ- అంతర్జాతీయ ఉత్తమ విధానాలకు తగినట్లు భాగస్వాములందరితో చర్చించి ఇథనాల్ మిశ్రణ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. దీనికి శాస్త్రీయ ఆధారాలు సహా ఆటోమోటివ్ తయారీదారుల నుంచి విస్తృత పరీక్షల మద్దతు ఉందన్నారు. ఇ20 ఇంధనం బీఐఎస్ ప్రమాణంతోపాటు బీఎస్-6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉందని తెలిపారు. దేశంలోని అన్ని చిల్లర విక్రయ కేంద్రాల్లో ఇది ఏకరీతిగా అందుబాటులో ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. వాస్తవానికి ప్రపంచంలోని అనేక దేశాలు కొన్నేళ్లుగా ఇథనాల్ మిశ్రణ ఇంధనాన్ని వాడుతున్నాయని వివరించారు.

చివరగా శ్రీ అశుతోష్ వర్మ మాట్లాడుతూ- ప్రపంచంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీదారు సంస్థల్లో ఒకటిగా విస్తృత సర్వీస్ డేటాను తమ కంపెనీ విశ్లేషించిందని చెప్పారు. పాత ఇంధనాలతో పోలిస్తే ఇ20తో నడిచే వాహనాల్లో ఎక్కువ నష్టం వాటిల్లినట్లు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు.

ఈ విధంగా ఇ20 కార్యక్రమంపై పరిశ్రమలకు గల నమ్మకం విశ్వాసాన్ని, వినియోగదారుల ప్రశ్నలకు పారదర్శక వివరణపై నిబద్ధతను ఈ బృందం పునరుద్ఘాటించింది.

# భారత్ కేసరి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి..

## స్మారక కార్యక్రమాన్ని రేపు కోల్‌కతాలో నిర్వహించనున్న సాంస్కృతిక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జులై 6:భారత్ కేసరి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి రేపు.. అంటే 2026 జులై 6న. ఈ సందర్భంగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి రెండు సంవత్సరాల పాటు అధికారిక స్మారక కార్యక్రమాలను నిర్వహించనుంది. దీనిలో భాగంగా ఒక ప్రత్యేక స్మారక కార్యక్రమాన్ని ఈ నెల 6న ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర హోం వ్యవహారాలు, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ, పర్యటన శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెఖావత్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ సువేందు అధికారి, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ మనోజ్ అగర్వాల్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ వివేక్ అగర్వాల్ సహా ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారు.

భారత్ కేసరి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకొని రెండు సంవత్సరాల పాటు దేశవ్యాప్త స్మారక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు 2025లో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దార్శనికత కలిగిన రాజనీతికోవిదుడు, విద్యావేత్త, పార్లమెంట్ సభ్యుడు, జాతీయవాద నేత డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిరకాల వారసత్వాన్ని గౌరవించుకొనే లక్ష్యంతో ఈ దేశవ్యాప్త కార్యక్రమాలను ప్రకటించారు. భారత్ రాజకీయ, సాంస్కృతిక, విద్యా, పారిశ్రామిక రంగాల రూపురేఖలను తీర్చిదిద్దడంలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ విశేష తోడ్పాటును అందించారు.

ముఖ్య అతిథి శ్రీ అమిత్ షాతో పాటు ఇతర ప్రముఖులు కోల్‌కతా.. భవానీపూర్లో ఉన్న డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ నివాసంలో పుష్పాంజలి ఘటించి రేపటి కార్యక్రమానికి శుభారంభాన్ని అందిస్తారు. దీని తరువాత, ముఖ్య అతిథి శ్రీ షా ఇకో పార్కుకు వెళ్లి, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125 అడుగుల ఎత్తు విగ్రహానికి శంకుస్థాపన చేస్తారు. ఈ విగ్రహం దేశానికి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అందించిన చిరకాల తోడ్పాటును గౌరవించుకొనే దిశగా చేపడుతున్న ఒక చరిత్రాత్మక కార్యక్రమంగా నిలుస్తుంది.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితంతో పాటు ఆయన వారసత్వానికి అంకితం చేసిన ఒక ప్రత్యేక ప్రదర్శనను కూడా మిలన్ మేళా ప్రాంగణంలో ప్రారంభిస్తారు. అరుదైన ఫోటోలు, పాత దస్తావేజులు, ఆకర్షణీయ మల్టీమీడియా ప్రదర్శనలు ఈ ఎగ్జిబిషన్లో భాగంగా ఉంటాయి. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవన యాత్ర, ఆదర్శాలు, విద్యారంగంలో ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు, భారత్ ప్రజాస్వామ్య సంస్థలతో పాటు పారిశ్రామిక అభివృద్ధిని బలోపేతం చేయడంలో ఆయన పోషించిన కీలక పాత్రను ఈ ఎగ్జిబిషన్ వివరిస్తుంది.

మిలన్ మేళా ప్రాంగణంలో ఏర్పాటు చేసే స్మారక కార్యక్రమంలో వందే మాతరం గేయాన్ని ఆలపిస్తారు. సీసీఆర్‌టీ ఆధ్వర్యంలో "సుర్, సంస్కృతి ఏవమ్ రాష్ట్ర" పేరిట ఒక ఘన సంగీతమయ శ్రద్ధాంజలిని సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో భారత శాస్త్రీయ, జానపద, సంప్రదాయ సంగీతానికి ప్రాతినిధ్యం వహించే 57 మంది నిపుణులైన కళాకారులు పాలుపంచుకుంటారు. ఈ కార్యక్రమం భారత సుసంపన్న సాంస్కృతిక వారసత్వంతో పాటు ఏకతా భావనకు అద్దం పడుతుంది. ఒక సంగీత రూపకంగా సంకల్పించిన ఈ కార్యక్రమాన్ని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సాంస్కృతిక జాతీయవాదం, జాతీయ సమైక్యత, విద్య, నాగరికతా సంబంధిత విలువలతో కూడిన శాశ్వత ఆదర్శాలను పండుగ చేసుకొనేలా నిర్వహించనున్నారు. సంగీత రూపకానికి పద్మశ్రీ తరుణ్ భట్టాచార్య దర్శకత్వం వహిస్తారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితాన్నీ, తోడ్పాటునీ ప్రతిబింబించే ఒక లఘు చిత్ర ప్రదర్శన కూడా ఉంటుంది. దీంతో పాటు, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి చెందిన ప్రతిపాదిత 125 అడుగుల ఎత్తు విగ్రహానికి శంకుస్థాపన సన్నివేశాన్ని కళ్లకు కట్టే ప్రత్యేక వీడియోను కూడా ఆవిష్కరిస్తారు.

దేశమంతటా రెండు సంవత్సరాల పాటు నిర్వహించే ఈ స్మారకోత్సవం దేశ అగ్రగామి రూపకర్తలలో ఒకరి చిరకాల వారసత్వాన్ని సంరక్షిస్తూ, ప్రోత్సహించాలన్న కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను చాటనుంది. అలాగే ఈ ఉత్సవం.. జాతీయవాదం, ప్రజాసేవ, భారత సమైక్యత, ప్రగతి పట్ల తిరుగులేని అంకిత భావాన్ని చాటిన మహనీయుని ఆదర్శాల స్ఫూర్తిని వర్తమాన తరంతో పాటు భావి తరాల వారికి కూడా స్ఫూర్తిని అందిస్తుంది.

# కొత్తపల్లిలో మహిళా సమైక్య భవనానికి భూమిపూజ..



మహబూబ్‌నగర్, జులై 6:మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం నిర్మిస్తున్న మహిళా సమైక్య భవనాలు దోహదపడతాయని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆర్. నర్సిములు అన్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పథకం నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సమైక్య భవనానికి భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ఆర్. నర్సిములు మాట్లాడుతూ, మహిళలు స్వయం సహాయక సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, పొదుపు సంఘాల కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రత్యేక భవనం అందుబాటులోకి రావడం వల్ల వారి కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగుతాయని అన్నారు. మహిళలు ఒకే వేదికపై సమావేశమై ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.

గ్రామీణ మహిళల సాధికారతను లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళా సమైక్య భవనాల నిర్మాణం కీలక అడుగని పేర్కొన్నారు. భవనం పూర్తయిన తర్వాత గ్రామంలోని మహిళా సంఘాలకు శాశ్వత వేదికగా ఉపయోగపడటంతో పాటు సామాజిక, ఆర్థిక కార్యక్రమాలకు కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, వార్డు సభ్యులు రామాంజనేయులు, లింగప్ప, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య పోరాటం చిరస్మరణీయం: నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, జులై 6: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతుల హక్కుల కోసం దొడ్డి కొమరయ్య చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు.

సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం దొడ్డి కొమరయ్య చేసిన త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొంటూ, అమరవీరుల ఆశయాలను కాపాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

# ప్రతి కుటుంబం ఆరు మొక్కలు నాటి సంరక్షించాలి

**-ఊట్కూర్ ఉప సర్పంచ్ ఆర్. రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్**



మహబూబ్‌నగర్, జులై 6:వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కుటుంబం కనీసం ఆరు మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని ఊట్కూర్ ఉప సర్పంచ్ ఆర్. రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్ పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం వన మహోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు ప్రాణవాయువును అందించడమే కాకుండా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందిస్తాయని తెలిపారు.

ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని, నాటిన ప్రతి మొక్కను బతికేలా సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు అశోక్ గౌడ్, మాజీ ఎంపీటీసీ హన్మంతు, మాజీ ఉప సర్పంచ్ ఇబాదూర్ రెహ్మాన్, సీనియర్ నాయకుడు మేటి భీమ్‌శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇ-గవర్నెన్స్-2026 జాతీయ పురస్కారాల్లో 'ఐసీఎంఆర్'కు స్వర్ణం

బకేంద్ర సిబ్బంది-ప్రజా ఫిర్యాదులు-పింఛన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిపాలన సంస్కరణలు-ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) ప్రదానం చేసే ఇ-గవర్నెన్స్ జాతీయ పురస్కారాలు- 2026లో భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్)కి స్వర్ణ పతకం లభించింది. జాతీయ ఆరోగ్య పరిశోధన ప్రధాన ప్రాజెక్టు 'ఐసీఎంఆర్-మైండ్స్' కింద యొక్క ప్రతిష్ఠాత్మక కార్యక్రమం "పౌర కేంద్రక సేవా ప్రదానం కోసం కృత్రిమ మేధ.. ఇతర ఆధునిక సాంకేతికతల వినియోగం ద్వారా ఆవిష్కరణ"కుగాను కేటగిరీ-2 కింద ఈ ఘనత దక్కింది. ఈ మేరకు 'డీఏఆర్‌పీజీ' శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అవార్డును బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ రాష్ట్ర సమాచార సాంకేతిక-కమ్యూనికేషన్ల శాఖ మంత్రి కల్నల్ రాజవర్ధన్ రాథోర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ వి.శ్రీనివాస్, 'డీఏఆర్‌పీ జీ'-పెన్షన్లు-పెన్షనర్ల సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి నివేదిత శుక్లా వర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 1-2 తేదీల్లో రాజస్థాన్‌లోని జైపూర్‌లో 29వ జాతీయ ఇ-గవర్నెన్స్ సదస్సు (ఎన్‌సీఈజీ)-2026లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

అసాంక్రమిక వ్యాధులతో పాటు మానసిక-మాదకద్రవ్య వ్యసన రుగ్మతల నిర్ధారణ పరీక్షలు- నిర్వహణను ఏకీకృతం చేసేలా 'ఐసీఎంఆర్' రూపొందించిన పరిశోధనాధ్యయన కార్యక్రమమే 'మైండ్స్'. ఇందులో భాగంగా వైద్యపరమైన నిర్ణాయక వ్యవస్థ (సీడీఎస్ఎస్)ను సంస్థ తయారు చేసింది. ప్రామాణిక మానసిక ఆరోగ్య పరీక్షలు, అంచనాలు, అనుసరణ, సాధారణ నిర్వహణ వంటి కార్యకలాపాల్లో నిపుణుల ద్వారా శిక్షణ పొందిన, నిపుణులు కాని క్షేత్రస్థాయి ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలకు ప్రదాతలకు కొన్ని సేవల బదిలీ కోసం ఈ నిదర్శనాధారిత డిజిటల్ నిర్ణయ మద్దతు వ్యవస్థ వీలు కల్పిస్తుంది.

సేవల ప్రదానంపై పర్యవేక్షణ, నిపుణులపై ఆధారపడటాన్ని తగ్గించడం లక్ష్యంగా ప్రత్యక్ష అడ్మినిస్ట్రేటివ్ డాష్‌బోర్డులు సహా వినియోగదారులను నిమగ్నం చేయడం, ప్రామాణిక డిజిటల్ స్క్రీనింగ్-అసెస్‌మెంట్ వర్క్‌ఫ్లో, పాత్ర-ఆధారిత వైద్య మార్గనిర్దేశం, ఆఫ్‌లైన్ కార్యకలాపాలు, బహుభాషా సదుపాయం, గేమిఫైడ్ ఫీచర్లు వంటివి ఈ వేదిక ద్వారా అందుబాటులో ఉంటాయి.

# త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో నిర్వహించిన రెండు వేర్వేరు దాడుల్లో లక్షకు పైగా కోడైన్ దగ్గు మందు సీసాలను స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ

న్యూఢిల్లీ, జులై 6:మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి, మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థలను నిర్మూలించడానికి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చేస్తున్న నిరంతర ప్రయత్నాల్లో భాగంగా... ఎన్‌డీపీఎస్ చట్టం-1985 నిబంధనల ప్రకారం త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన రెండు వేర్వేరు దాడులలో భారీ సంఖ్యలో కోడైన్ ఆధారిత దగ్గు మందు సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

అగర్తలా వెళ్తున్న రైలు పార్శిల్ వ్యానులో రవాణా చేస్తున్న సరుకును 02.07.26న డీఆర్ఐ అధికారులు అడ్డగించారు. కవర్ కార్గోగా ఉపయోగించిన పొడి పదార్థపు పొర కింద, 80 లోహపు డ్రమ్ముల్లో ఈ నిషేధిత సరుకును చాకచక్యంగా దాచి రవాణా చేస్తున్నట్లు డీఆర్ఐ అధికారులు కనుగొన్నారు. మొత్తం 55,626 కోడైన్ ఆధారిత దగ్గు మందు సీసాలను స్వాధీనం చేసుకుని జప్తు చేశారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, అస్సాం రైఫిల్స్ సహకారంతో ఈ దాడులను నిర్వహించారు. ఈ సరుకును స్వీకరించడానికి వచ్చిన ఒక వ్యక్తినీ అరెస్టు చేశారు.

దాదాపు అదే సమయంలో, పశ్చిమ బెంగాల్‌లోని దంకునీలో నిర్వహించిన మరో దాడిలో భాగంగా ఒక గిడ్డంగిలో డీఆర్ఐ అధికారులు సోదాలు నిర్వహించారు. అక్కడ సీల్ చేసిన 104 ఇనుప డ్రమ్ముల నుంచి 56,225 కోడైన్ ఆధారిత దగ్గు మందు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడకుండా ఉండేందుకు, ఆ సీసాలను డ్రమ్ముల లోపల చైనా క్లే పౌడర్ పొర కింద దాచి ఉంచారు. ఎన్‌డీపీఎస్ చట్టం-1985 నిబంధనల కింద డీఆర్ఐ అధికారులు పెద్ద మొత్తంలో సరుకును సీజ్ చేశారు.

మొత్తంగా, ఈ రెండు ఆపరేషన్ల ద్వారా సుమారు 1.11 లక్షల కోడైన్ ఆధారిత దగ్గు మందు సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఒక వ్యక్తిని అరెస్టు చేశారు.

నల్లమందు నుంచి తయారు చేసే కోడైన్‌కు, నియంత్రిత ఔషధ తయారీలో చట్టబద్ధమైన చికిత్సా ఉపయోగం ఉంది. ఈ కోడైన్ ఆధారిత దగ్గు సిరప్‌లను అక్రమ వినియోగం కోసం మళ్లించినప్పుడు, వాటిని దుర్వినియోగం చేసే అవకాశం ఉన్న కారణంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠాలు తరచుగా వీటిని లక్ష్యంగా చేసుకుంటాయి.

మాదక ద్రవ్యాలు కలిగిన ఔషధాలను వినూత్న పద్ధతులతో దాచి ఉంచి అక్రమ రవాణా కోసం మళ్లించడానికి వ్యవస్థీకృత స్మగ్లింగ్ సిండికేట్లు చేస్తున్న నిరంతర ప్రయత్నాలను ఈ స్వాధీనాలు స్పష్టం చేస్తున్నాయి. సమన్వయంతో కూడిన, నిఘా ఆధారిత కార్యకలాపాల ద్వారా ఇటువంటి ముఠాలను నిర్మూలించడానికి డీఆర్ఐ కట్టుబడి ఉంది.

# భారతీయ నౌకాదళానికి చెందిన నౌకల సింగపూర్ యాత్ర విజయవంతం

న్యూఢిల్లీ, జులై 6:భారత నౌకాదళ నిర్వహణ పూర్వక మోహరింపులో భాగంగా, తూర్పు నౌకాదళానికి చెందిన 'ఉదయగిరి', 'శక్తి'లతో పాటు 'కవరత్తి'లు రియర్ అడ్మిరల్ ఆలోక్ ఆనంద్ నాయకత్వంలో సింగపూర్లోని చాంగీ నౌకాదళ స్థావరానికి నౌకాశ్రయ యాత్రను విజయవంతంగా ముగించాయి. ఈ కార్యక్రమం భారత్, సింగపూర్ పక్షాల మధ్య వ్యూహాత్మక, నౌకావాణిజ్య భాగస్వామ్యాన్ని దృఢతరం చేసింది. ఆసియాన్-భారత్ నౌకావాణిజ్య సహకార సంవత్సరం, భారత్ ప్రభుత్వ 'యాక్ట్ ఈస్ట్ విధానం' లక్ష్యాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు సాగింది. రెండు నౌకాదళాల మధ్య అంతరనిర్వహణీయతనీ, నౌకాదళ సంబంధిత సహకారాన్నీ పటిష్ఠపరుచుకొనే ఉద్దేశంతో క్రాస్-డెక్ యాత్రలు సహా అనేక వృత్తి నైపుణ్య ప్రధాన సమావేశాలను నిర్వహించారు. ఐఎన్ఎస్ కవరత్తిని పాఠశాల విద్యార్థులు చూశారు. వారు నౌకాదళ కార్యకలాపాలు, యుద్ధనౌకలో జీవితం, భారతీయ నౌకాదళానికి మార్గదర్శకంగా ఉండే విలువల గురించి తెలుసుకున్నారు. విజయవంతంగా ముగిసిన ఈ కార్యక్రమం భారత్, సింగపూర్ మధ్య అంతకంతకు విస్తరిస్తున్న నౌకావాణిజ్య సహకారంలో మరో కీలక ప్రగతి ప్రస్థానాన్ని సూచిస్తోంది. నౌకాశ్రయం వద్ద నిర్వహించిన సమావేశాలతో వృత్తినైపుణ్యానికి సంబంధించిన అవగాహనను పెంపొందింప చేసుకోవడం, నిర్వహణ కార్యకలాపాల పరంగా సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు ఆ ప్రాంతంలో శాంతినీ, సుస్థిరత్వాన్నీ, భద్రతనీ పరిరక్షించడానికి ఉమ్మడి ప్రయత్నాల్ని ప్రోత్సహించుకోవడానికీ తోడ్పాటు లభించినట్లయింది.

# కాంగ్రెస్ పార్టీ మండల, మున్సిపాల్ అధ్యక్షుల ఎన్నిక..

హైదరాబాద్, జులై 6: కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడుగుల మండలాలకు నూతన కాంగ్రెస్ అధ్యక్షులను నియమించినట్లు ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ తెలిపారు.

సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రతిపాదనల మేరకు, డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి సిఫారసుతో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోలేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జేపీసీ చైర్మన్ అవ్వారి శివలింగం, కడ్తాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా అన్నాన్‌పల్లి మాజీ సర్పంచ్ పోతుగంటి శంకర్, మాడుగుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బట్టు కిషన్ రెడ్డి, తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు.

నూతనంగా నియమితులైన మండల కాంగ్రెస్ అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అవ్వారి శివలింగం, కాసు శ్రీనివాస్ రెడ్డి, బట్టు కిషన్ రెడ్డి, పోతుగంటి శంకర్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభినందించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# దేశ సమగ్రతకు శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం: విక్రమ్ రెడ్డి



హైదరాబాద్, జులై 6:దేశ సమగ్రత కోసం, జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా మారడం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన అమరజీవి, నిఖార్సైన జాతీయవాది డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రమ్ రెడ్డి కొనియాడారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్‌పరిధిలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు కావేరీ శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విక్రమ్ రెడ్డి హాజరై, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ పారిశ్రామిక రంగానికి, విద్యా రంగానికి కేంద్ర మంత్రిగా ముఖర్జీ వేసిన పునాదులు నేటికీ దేశ ప్రగతికి ఎంతగానో తోడ్పడుతున్నాయని గుర్తుచేశారు. ఆయన నిస్వార్థ సేవ, దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి జైతువాలా కృష్ణ, మాజీ వార్డు సభ్యులు మలిగే అశోక్, పార్టీ నాయకులు చెంచాల సురేష్ ముదిరాజ్, నవీన్ కుమార్, గడిల వాసుదేవ రెడ్డి, ఉద్దమరి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం..

అమరావతి, జులై 6:భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా కేసరపల్లి హరిజనవాడలో సోమవారం ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్థానిక నాయకులతో కలిసి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పుష్పమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, భారత రాజకీయాల్లో బాబు జగ్జీవన్ రామ్ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. వెనుకబడిన వర్గం నుంచి వచ్చి అనేక సామాజిక అడ్డంకులను అధిగమించి దేశ ఉప ప్రధానిగా ఎదిగిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆనాటి రాజకీయ పరిస్థితుల కారణంగా ఆయన తన పూర్తి నాయకత్వ సామర్థ్యాన్ని చాటుకునే అవకాశం దక్కలేదని, లేకపోతే దేశ ప్రధానిగా సేవలందించే అవకాశం కూడా ఉండేదని పేర్కొన్నారు. చరిత్రలో ఆయనకు కొంత అన్యాయం జరిగినప్పటికీ, దేశానికి అందించిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నే హరికృష్ణ, కోసూరి వెంకటేష్, నీలం అశోక్, గురిందపల్లి కోటేశ్వరరావు, మేడూరి సురేష్, జాస్తి రేణుక, అన్నే అంజిబాబు, సుధాబత్తుల రామకృష్ణ, జాస్తి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పటివరకు బొగ్గు మంత్రిత్వ శాఖ, సీఐఎస్ఎఫ్ తీసుకున్న చర్యలను అభినందించిన శ్రీ అమిత్ షా

న్యూ ఢిల్లీ, జులై 6:న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో బొగ్గు అక్రమ తవ్వకాలు, దొంగతనాల పరిస్థితిని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా... బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి సమీక్షించారు. ఈ సమావేశానికి కేంద్ర హోం శాఖ కార్యదర్శి, కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి సహా బొగ్గు మంత్రిత్వ శాఖ, సీఐఎస్ఎఫ్, కోల్ ఇండియా లిమిటెడ్, బీసీసీఎల్‌లకు చెందిన సీనియర్ అధికారులు హాజరయ్యారు.

ధన్‌బాద్, పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న బొగ్గు అక్రమ తవ్వకాలు, దొంగతనాల పట్ల కేంద్ర హోంమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అక్టోబర్ 2025 మొదటి వారంలో జరిగిన సమీక్ష తర్వాత అనేక పటిష్ఠ చర్యలు తీసుకున్నట్లు బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులు హోంమంత్రికి తెలియజేశారు. గనులు, ఖనిజాల (అభివృద్ధి-నియంత్రణ) చట్టం -1957 కింద చర్యలు తీసుకునేందుకు సీఐఎస్ఎఫ్, కోల్ ఇండియా లిమిటెడ్ అధికారులకు పూర్తి అధికారం ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ అధికారం ద్వారా వారు కోర్టులో కేసులు దాఖలు చేయడం, అక్రమ బొగ్గు నిల్వ ఉన్నట్లు అనుమానించే ప్రాంగణాల్లోకి ప్రవేశించడం, సోదాలతో పాటు స్వాధీన కార్యకలాపాలూ నిర్వహించడం, అక్రమంగా తవ్విన ఖనిజాలు సహా అటువంటి అనధికార కార్యకలాపాల్లో ఉపయోగించే పనిముట్లు, పరికరాలు, వాహనాలను స్వాధీనం చేసుకోవడం వంటివి చట్టబద్ధంగా చేయగలరు. డిసెంబర్ 2025లో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో బొగ్గు రంగ సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించడం సహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఆ కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలియజేశారు.

బొగ్గు మంత్రిత్వ శాఖ, సీఐఎస్ఎఫ్ ఇప్పటివరకు తీసుకున్న చర్యలను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అభినందించారు. అక్రమ మైనింగ్ ముప్పును అరికట్టడానికి ఇంకా చాలా చేయాల్సి ఉందనీ ఆయన స్పష్టం చేశారు. అక్రమ మైనింగ్, బొగ్గు అనధికార రవాణాకు సమగ్రమైన, కాలపరిమితితో కూడిన ప్రతిస్పందన కోసం "జీరో కోల్ లీకేజ్ ప్లాన్"ను అమలు చేయడంతో పాటుగా, పలు కీలక ఆదేశాలను హోంమంత్రి జారీ చేశారు. ఎంఎండీఆర్ చట్టం కింద సీఐఎస్ఎఫ్, కోల్ ఇండియా లిమిటెడ్ అధికారులకు సంపూర్ణ అధికారాలు కల్పించినప్పటికీ... ఆమోదించిన ప్రామాణిక కార్యాచరణ విధానానికి అనుగుణంగా ఈ అధికారాలను కఠినంగా, సమన్వయంతో అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు.

తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని శ్రీ అమిత్ షా బొగ్గు మంత్రిత్వ శాఖను ఆదేశించారు. చట్టబద్ధంగా తవ్విన బొగ్గును మాత్రమే వినియోగదారులు ఉపయోగించేలా చూడటానికి, బొగ్గు అక్రమ రవాణాను నిరోధించడానికి జీఎస్టీ అధికారులనూ ఇందులో భాగస్వాములను చేయడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. రవాణా అవుతున్న మొత్తం బొగ్గుకు సంబంధించిన ఈ-వే బిల్లులను ధ్రువీకరించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని శ్రీ అమిత్ షా సూచించారు.

ప్రమాదకర ప్రాంతాల్లో సిబ్బందిని తక్షణం మోహరించేందుకు వీలుగా, బొగ్గు రంగాన్ని సీఐఎస్ఎఫ్ మోహరింపు ప్రాధాన్య జాబితాలో చేర్చాలని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులను కేంద్ర హోంమంత్రి ఆదేశించారు. సమాచారం అందిన వెంటనే అక్రమ గనుల తవ్వకందారులపై తక్షణ చర్యలు తీసుకునేందుకు వీలుగా... ప్రమాదకర ప్రాంతాల్లో సత్వర ప్రతిస్పందన బృందాల ఏర్పాటు సహా బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆయన సీఐఎస్ఎఫ్‌ను ఆదేశించారు.

సాంకేతికతను మరింత సమర్థంగా ఉపయోగించాల్సిన అవసరాన్ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాల్లో పాల్గొన్న ప్రాంతాలు, వ్యక్తులను గుర్తించడానికి ఇంటిగ్రేటెడ్ కమాండ్-కంట్రోల్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే హై-రెజల్యూషన్ కెమెరాలను ఉపయోగించాలని ఆయన ఆదేశించారు. ప్రజా వనరులను, శాంతిభద్రతలను, చట్టబద్ధమైన బొగ్గు గనుల తవ్వకం కార్యకలాపాల ప్రయోజనాలనూ పరిరక్షించడం కోసం అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హోంమంత్రి తెలిపారు.

# బ్రిక్స్ దేశాల మాదకద్రవ్య నిరోధక సంస్థల అధిపతుల సమావేశానికి భారత్ ఆతిథ్యం

న్యూఢిల్లీ, జులై 6:బ్రిక్స్ దేశాల మాదక ద్రవ్య నిరోధక సంస్థల అధిపతుల సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 6-7 తేదీల్లో అస్సాంలోని గౌహాతిలో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. బ్రిక్స్ కూటమిలోని మాదక ద్రవ్య నియంత్రణ సంస్థల మధ్య సంస్థాగత కొనసాగింపు బలోపేతం, లోతైన కార్యాచరణ సహకారాన్ని పెంపొందించడం లక్ష్యంగా బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన మాదక ద్రవ్య నిరోధక సంస్థల అధిపతులు, సీనియర్ అధికారులు సమావేశం కానున్నారు.

కృత్రిమ మందులు, నూతన సైకోయాక్టివ్ పదార్థాలు (ఎన్‌పీఎస్), డార్క్‌నెట్ ద్వారా జరిగే అక్రమ రవాణా, క్రిప్టోకరెన్సీ ఆధారిత ఆర్థిక వ్యవహారాల విస్తరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా స్వరూపం గణనీయంగా మారిపోయింది. వీటి కారణంగా సంక్లిష్టమైన అంతర్జాతీయ సవాళ్లూ పెరుగుతున్నాయి. అక్రమ రవాణాను అడ్డుకునే సాంకేతికతలు, డేటా విశ్లేషణ, ఆర్థిక నిఘాలో వచ్చిన పురోగతులు... మెరుగైన అంతర్జాతీయ సహకారానికి, సమన్వయంతో కూడిన చర్యలకు గణనీయ అవకాశాలను కల్పిస్తున్నాయి. బ్రిక్స్ సహకారాన్ని కేవలం చర్చలకే పరిమితం చేయకుండా... నిర్మాణాత్మక, కార్యాచరణ-ఆధారిత సహకారంగా మార్చడంలో ఈ సమావేశం కీలక ముందడుగు అవుతుందని భారత్ భావిస్తోంది. కార్యాచరణ సమన్వయాన్ని బలోపేతం చేయడం, నిఘా సమాచారాన్ని పంచుకోవడం, సామర్థ్యాలను పెంపొందించడం, కొత్తగా తలెత్తుతున్న మాదకద్రవ్యాల సంబంధిత ముప్పులకు సమష్టిగా ప్రతిస్పందించడంపై ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారిస్తుంది. భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశం మూడు కీలక ప్రాధాన్యాలపై దృష్టి సారిస్తుంది:

మాదకద్రవ్యాల ముప్పును ఎదుర్కోవడంలో భారత్ తీసుకుంటున్న నిర్ణయాత్మక చర్యలను చర్చించేందుకు ఈ సమావేశం అవకాశం కల్పిస్తుంది. మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల దుర్వినియోగం ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి, దేశ యువత భవిష్యత్తుకు పెను ముప్పుగా మారుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగానికి వ్యతిరేకంగా భారత్ తన పోరాటాన్ని గణనీయంగా బలోపేతం చేసింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాల ముఠాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటూనే... అవగాహన కల్పన, సామాజిక భాగస్వామ్యం, వ్యసనం బారిన పడిన బాధితులకు చికిత్స అందించడానికీ అంతే ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వంలోని అన్ని విభాగాల భాగస్వామ్యం, నెట్‌వర్క్-కేంద్రిత విధానాన్ని అవలంబిస్తూ... మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో సంస్థాగత సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా భారత్ ఇటీవలే మాదకద్రవ్యాల నియంత్రణపై విజన్ డాక్యుమెంట్ (2026-2029)నూ విడుదల చేసింది.

రహస్య ప్రయోగశాలలు, అభివృద్ధి చెందుతున్న సింథటిక్ డ్రగ్ ధోరణుల గురించి సమాచారాన్ని పంచుకోవడం, ముడి పదార్థాల సంబంధిత రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్‌పై పర్యవేక్షణను మెరుగుపరచడం, నిఘా సమాచారన్ని పంచుకోవడం, ఉత్తమ పద్ధతులను పంచుకోవడం, ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, నిపుణుల అభిప్రాయాలను పంచుకోవడం ద్వారా సహకారాన్ని బలోపేతం చేయడానికి అధ్యక్ష హోదాలో భారత్ ప్రయత్నిస్తోంది.

**పెరుగుతున్న సవాళ్ల పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశాలు**

రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో, సభ్య దేశాలు తమ దేశాల్లో మాదకద్రవ్యాల పరిస్థితిని చర్చిస్తాయి. తీవ్రమైన, కొత్తగా తలెత్తుతున్న ప్రపంచ సవాళ్ల ఆధారంగా 06 అంశాలతో నిర్వహించే ప్రత్యేక సమావేశాల్లో సభ్య దేశాలు పాల్గొంటాయి.

''సమర్థత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత నిర్మాణం" అనే ప్రధాన ఇతివృత్తం ఆధారంగా 2026లో భారత్ బ్రిక్స్ సారథ్యం ముందుకు సాగుతోంది. బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, భారత్, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అనే ప్రపంచంలోని 11 ప్రధాన అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాలను బ్రిక్స్ ఒకచోట చేర్చుతుంది. ప్రపంచ, ప్రాంతీయ ప్రాముఖ్యత కలిగిన సమకాలీన సమస్యలపై, ప్రపంచస్థాయి రాజకీయ, ఆర్థిక పాలనకు సంబంధించిన అంశాలపై సంప్రదింపులు, సహకారం కోసం ప్రయోజనకరమైన వేదికగా ఇది పనిచేస్తుంది.

# ఆరోగ్య సమస్యకు పరిష్కారం

అమరావతి, జులై 6: జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా నేడు అర్జీదారులకు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందించారు. కర్లపాలెం మండలం ప్యార్లి గ్రామ ఆయుష్ వైద్య కేంద్రానికి చెందిన డాక్టర్ పి. సిద్ధార్థ, డాక్టర్ భువనేశ్వరి, పీటీఎస్ సుబ్బారావు, కాంపౌండర్ రమేష్, యోగ ఇన్‌స్ట్రక్టర్ రవి తదితరులు పాల్గొని అర్జీదారుల ఆరోగ్య సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని తగిన వైద్య సూచనలు అందించారు. వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేసి, వాటిని ఎలా వాడాలో వివరించారు. అలాగే మందుల వినియోగ విధానాన్ని లిఖితపూర్వకంగా రాసి అందజేశారు. ప్రజా సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యల పరిష్కారానికీ ప్రాధాన్యం ఇస్తూ వైద్య శిబిరం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అర్జీదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా జిల్లా ప్రజల నుంచి కలెక్టర్‌కు ప్రశంసలు లభిస్తున్నాయి.

# ఎంపీ .. ఎమ్మెల్సీలను కలిసిన బీఆర్ఎస్ నాయకులు..



హైదరాబాద్, జులై 6: కేసముద్రం బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావులను హైదరాబాద్ బంజారాహిల్స్ లోని వద్దిరాజు స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేసముద్రం మునిసిపాలిటీ ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కౌన్సిలర్లుగా విజయం సాధించిన ఆగే రాము, పాయిరాల శరత్, రావుల వినయ్ రెడ్డి, దూడపాక కృష్ణలతో పాటు పార్టీ నాయకులు జాటోత్ హరీష్ నాయక్, పురం రమేశ్, మేకల సురేష్, బానోత్ దేవేందర్, కన్నెబోయిన శ్రీను తదితరులు కలిసి సమావేశమై ఇష్టాగోష్టి జరిపారు.

# తొలి షాట్‌కు క్లాప్ కొట్టి చిత్రీకరణ ప్రారంభించిన ఖుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు, ఆంధ్రప్రభ : కర్నూలు నగరంలోని ఎన్.ఆర్. పేటలో ఇందిర కృష్ణ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న నూతన తెలుగు చలన చిత్రానికి సోమవారం ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తొలి షాట్‌కు క్లాప్ కొట్టి చిత్రీకరణను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు సినీ పరిశ్రమ రోజురోజుకు అభివృద్ధి చెందుతూ కొత్త ప్రతిభకు వేదికగా నిలుస్తోందన్నారు. యువ దర్శకులు, నిర్మాతలు, నటీనటులను ప్రోత్సహించే ఇటువంటి చిత్రాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. సృజనాత్మకతతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందడంతో పాటు వాణిజ్యపరంగానూ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

చిత్ర నిర్మాతలు, దర్శకుడు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు అభినందనలు తెలియజేసిన సోమిశెట్టి వెంకటేశ్వర్లు, చిత్ర నిర్మాణం ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తై ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. పూజా కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, సినీ ప్రముఖులు, అభిమానులు, స్థానికులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగగా, చిత్ర యూనిట్ సభ్యులు ముఖ్య అతిథికి కృతజ్ఞతలు తెలిపారు.

# హరితహారం చెట్లను నరికిన వారికి జరిమానా

నిజామాబాద్, జులై 6:బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగాయి. అయితే కొందరు వ్యక్తులు విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయని కారణంతో మరికొందరు చెత్తను వారికి చేనుకు కంచె వేసుకుంటున్నారు.

ఈ ఘటనపై 'నమస్తే తెలంగాణ'లో 'హరితహారం చెట్లు నరికి కంచవేశారు..' అనే కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై పందిమడుగు గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ స్పందించి చెట్లు నరికిన ఒకరికి రూ.2వేలు, మరొకరికి రూ.1000 జరిమానా విధించారు. ఎవరైనా రోడ్డుకు ఇరువైపుల నాటిన చెట్లను నరికితే వారిపై కేసులు నమోదు చేయించి చర్యలు తీసుకుంటామని కార్యదర్శి, సర్పంచ్ గోవింద్ తెలిపారు.

# ఉద్యోగుల సంక్షేమం, పరిపాలనా సామర్థ్య బలోపేతం లక్ష్యంగా ప్రభుత్వ సంస్కరణలు: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ, జులై 6:ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, పరిపాలనాపరమైన సంస్కరణలకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించేందుకు గానూ భారతీయ మజ్దూర్ సంఘ్, దాని అనుబంధ ఉద్యోగ సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 19 మంది సభ్యుల దేశవ్యాప్త ప్రతినిధుల బృందం ఈ రోజు... కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయం, అణుశక్తి విభాగం, అంతరిక్ష విభాగం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌ను కలిసింది.

ప్రభుత్వ ఉద్యోగుల-కేంద్రిత కార్యక్రమాలను సులభతరం చేసినందుకు, ముఖ్యంగా ఆయుధ కర్మాగార బోర్డు పునర్వ్యవస్థీకరణ తరువాత దాదాపు 65,000 మంది పూర్వ ఉద్యోగులను సాధారణ ప్రభుత్వ సేవల్లో తిరిగి నియమించాలన్న నిర్ణయం ద్వారా వేలాది మంది ఉద్యోగుల భవితను కాపాడినందుకు ప్రతినిధి బృందం కేంద్రమంత్రికి ధన్యవాదాలు తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఒక చరిత్రాత్మకమని తెలిపింది.

దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, శాస్త్రీయ సంస్థలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సేవలకు చెందిన ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారతీయ మజ్దూర్ సంఘ్, భారతీయ ప్రతిరక్షా మజ్దూర్ సంఘ్, ప్రభుత్వ ఉద్యోగుల జాతీయ సమాఖ్య, ప్రభుత్వ రంగ ఉద్యోగుల జాతీయ సమాఖ్య, షార్ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్, అంతరిక్ష రంగ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఈ ప్రతినిధి బృందంలో ఉన్నారు.

ప్రతినిధి బృందానికి స్వాగతం పలుకుతూ... సంస్థాగత చర్చల ద్వారా సేవా సంబంధిత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో ఉద్యోగ సంఘాలు పోషించిన నిర్మాణాత్మక పాత్రను డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసించారు. సంబంధిత వర్గాలతో నిరంతర సంప్రదింపులు పాలనను బలోపేతం చేస్తాయనీ... ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సమస్యల సకాల పరిష్కారానికీ దోహదపడతాయని ఆయన అన్నారు.

ఆయుధ కర్మాగార పూర్వ ఉద్యోగుల డీమ్డ్ డిప్యుటేషన్‌ను పదవీ విరమణ తేదీ వరకు పొడిగించడానికి మద్దతునిచ్చిన ఎంపవర్డ్ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సభ్యునిగా డాక్టర్ జితేంద్ర సింగ్‌కు ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈ ఉద్యోగులను తిరిగి సాధారణ ప్రభుత్వ సేవల్లో నియమించాలనే నిర్ణయం దాదాపు 65,000 మంది ఉద్యోగులకు దీర్ఘకాలిక సేవా భద్రతను అందించిందన్నారు. ఆయుధ కర్మాగార బోర్డు కార్పొరేటీకరణ ద్వారా తలెత్తే ముఖ్యమైన ఆందోళనల్లో ఒక దాన్ని ఈ నిర్ణయం విజయవంతంగా పరిష్కరించిందని ప్రతినిధులు తెలిపారు.

మరింత పరిశీలన అవసరమైన పలు సేవా సంబంధిత అంశాలపైనా ప్రతినిధులు చర్చించారు. కారుణ్య నియామకాల కేసులకు పాత పింఛను పథకం ప్రయోజనాన్ని విస్తరించడం, ఉద్యోగపరమైన పురోగతి, కేడర్ సంబంధిత విషయాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై సంబంధిత వ్యక్తులతో విస్తృత సంప్రదింపులు వీటిలో భాగంగా ఉన్నాయి.

సిబ్బంది నిర్వహణ, భవిష్యత్ విధాన సంస్కరణలకు సంబంధించిన విషయాలపై చర్చల సందర్భంగా గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో తరచూ సంప్రదించడాన్ని ప్రతినిధి బృందం అభినందించింది. అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, ఉద్యోగులను ప్రభావితం చేసే సేవా సంబంధిత విషయాల సకాల పరిష్కారాన్ని నిర్ధారించడానికి పరిపాలనా ప్రక్రియల సరళీకృతాన్ని కొనసాగించాలని ప్రతినిధి బృందం సూచించింది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం సంప్రదింపులతో కూడిన, స్పందించే విధానానికి కట్టుబడి ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. సమస్యలను సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాల ద్వారా తగినవిధంగా పరిశీలిస్తాయని ఆయన పేర్కొన్నారు. పరిపాలనను మెరుగుపరచడం, విధానాలను సరళీకరించడం, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి లక్ష్యాలతో కూడిన సూచనలను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు.

ప్రగతిశీల పరిపాలనా సంస్కరణల ద్వారా పాలనను మరింత పారదర్శకంగా, సమర్థంగా, పౌర కేంద్రితంగా మార్చడానికి ప్రధానమంత్రి శ్రీ మోదీ ఎల్లప్పుడూ ప్రాధాన్యమిస్తారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఆచరణాత్మక సమస్యలను గుర్తించి, విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తగిన విధానపరమైన ప్రతిస్పందనలను రూపొందించడంలో ఉద్యోగ సంఘాలతో నిరంతర సంప్రదింపులు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు.

సేవా నిబంధనలు, పింఛను, సిబ్బంది నిర్వహణకు సంబంధించిన విషయాలపై ప్రతినిధి సంస్థలతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తూనే, ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలమైన సంస్కరణలనూ కొనసాగిస్తుందని ప్రతినిధి బృందం విశ్వాసం వ్యక్తం చేసింది.

తమ అభిప్రాయాలను తెలియజేయడానికి అవకాశం కల్పించినందుకు బృంద సభ్యులు డాక్టర్ జితేంద్ర సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న సంప్రదింపుల విధానాన్ని వారు ప్రశంసించారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి మిక్కిలినేని

## జూలై 7...జానపద కళాప్రపూర్ణ మిక్కిలినేని జయంతి

పౌరాణిక, జానపద సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలు పోషించి, అందరి మన్ననలను పొంద గలిగిన ప్రముఖ తెలుగు రంగస్థల, సినిమా నటుడు మిక్కిలినేని. అయితే రాధా కృష్ణ మూర్తి, చాలా మందికి చలన చిత్ర నటుడిగా తెలుసు. కొద్ది మందికి రంగ స్థల నటుడిగా తెలుసు. మరికొంత మందికి స్వాతంత్ర్య సమర యోధునిగా, నిజాం వ్యతిరేక ఉద్యమ కారునిగా తెలుసు. ఇంకొంత మందికి గ్రంథకర్తగా తెలుసు. కొందరికే కమ్యూని స్టుగా బాగా తెలుసు. అందుకే ''బహుముఖ ప్రజ్ఞాశాలి''. అన్న మాటకు నిలువుటద్దంగా నిలిచారు మిక్కిలినేని.

మిక్కిలినేని గా సుపరిచితులైన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి (జూలై 7, 1916 – ఫిబ్రవరి 22, 2011) ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలంలోని లింగాయ పాలెంలో 1914, జులై 7న జన్మించారు. కోలవెన్నులో అమ్మమ్మ దగ్గర పెరిగిన ఆయన నాటకాలపై మక్కువతో రంగస్థలం వైపు మళ్లారు. జానపద కళారూపాలతో ప్రభావితులై కపిలవాయి రామనాథ శాస్త్రి శిష్యులైనారు. జానపద, పౌరాణిక నాటకాల్లో పురుష, స్త్రీ పాత్రలను ధరించి ప్రేక్షకులను ఆకట్టు కున్నారు. బ్రిటిష్ పాలకుల వ్యతిరేక పోరాటాలు చేశారు. హేతువాద ఉద్యమాలలో క్రియాశీల కార్యకర్తగా ఎన్నో ఉద్యమా లను నిర్వహించి, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సహాయ పడ్డారు. అన్యాయం జరుగుతున్న చోట న్యాయ పోరాటం చేయాలని గళం విప్పిన ఆయన...ప్రజానాట్య మండలికి వ్యవస్థాపక సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర పోరాటాల్లో పాల్గొని ఐదుసార్లు జైలుకు వెళ్లారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిజాం పాలన కు వ్యతిరేకంగా కొంతకాలం పోరాడారు.

పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం, కాటమరాజు కథ తదితర 30 చారిత్రక, జానపద కళారూపాల ద్వారా ప్రజలను సమీకరించిన ప్రజానాట్య మండలి 1940లలో నిషేధానికి గురైంది. ఫలితంగా కొందరు సినీ రంగాన్ని ఆశ్రయించారు. వారిలో మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి వంటి ముఖ్యులున్నారు. సహజంగా సినిమా రంగంపై ఆసక్తితో మిక్కిలినేని అలా ఆ దారి పట్టారు. ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు తండ్రి కె.ఎస్.ప్రకాశరావు దర్శకత్వం వహించిన 1949లో 'దీక్ష' సినిమాతో సినిమా కెరీర్‌ని మొదలు పెట్టారు మిక్కిలినేని. 1949లో కేఎస్ ప్రకాశ రావు దీక్షతో మొదలై బాలకృష్ణ సినిమా భైరవ ద్వీపం వరకూ 400లకు పైగా తెలుగు చిత్రాల్లో నటించి, పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో భిన్న విభిన్న పాత్రలు ధరించారు.

ఐదుసార్లు జైలుకు వెళ్లిన స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు. గ్రంథాలయ, హేతువాద ఉద్యమాలలో క్రియాశీల కార్యకర్త, నాటకరంగ నటులు,



'ఆంధ్రుల నట రత్నాలు' తదితర రచనలను చేసినవారు, ప్రజానాట్య మండలి వ్యవస్థాపక సభ్యులు, 'తెలుగువారి జానపద కళా రూపాలు' గ్రంథ రచయిత. 'మన పగటి వేషాలు', 'ఆంధ్రుల నృత్యకళావికాసం' తదితర పరిశోధనాత్మక గ్రంథ రచయిత మిక్కిలినేని. ఆయన వంటి నూనూగు మీసాల కుర్రాళ్లను అప్పటి సంక్షుభిత సమాజం రాటుదేల్చింది. అంతర్జాతీయంగా ఫాసిస్టులకు, దేశీయంగా బ్రిటిష్ – నైజాం నియంతృత్వానికి, ఆంధ్ర ప్రాంతంలో జమీందారీల అణచి వేతకు వ్యతిరేకంగా కమ్యూ నిస్టు పార్టీ రూపొందించిన కళాసైన్యం ప్రజానాట్య మండలి. ఆ వాతావరణంలో భార్య సీతా రత్నాన్ని మిక్కిలి నేని ఎనభై ఏళ్లనాడు నాటక రంగానికి పరిచయం చేసిన ప్రజా కళాకారులు.

కపిలవాయి రామనాథ శాస్త్రి శిష్యరికంలో 'మిక్కిలినేని' ఇంటి పేరుగల వారికి గర్వకారణంగా బహుముఖంగా ఎదిగి, ఫిబ్రవరి 22, 2011 తేదీన మంగళవారం మిక్కిలినేని విజయవాడలో తన 95వ ఏట మరణించారు.

నాటక రంగానికి చెందిన 400 మంది కళాకారులను 'నటరత్నాలు' శీర్షిక ద్వారా తెలుగు పాఠకులకు పరిచయం చేసిన ప్రత్యేకత మిక్కిలినేనిదే. వీధి నాటకాలు – జముకుల కథలు – బుర్రకథలు ప్రదర్శిం చిన పాత రోజులను మరవ కుండా, పాత స్నేహితాలను పునరావిష్క రించుకుంటూ తెలుగు నేల నాలుగు చెరగులా తిరిగి స్వయంగా తెలుసుకున్న సమాచారంతో 'ఆంధ్ర నాటకరంగ చరిత్ర' రచించారు.

నటరత్నాలు (1980, 2002) ఆంధ్ర నాటకరంగ చరిత్ర, తెలుగువారి జానపద కళా రూపాలు, ప్రజా పోరాటాల రంగస్థలం, ఆంధ్రుల నృత్య కళా వికాసం, తెలుగు వారి చలన చిత్ర కళ తదితర రచనలు చేశారు.

నాటకాల్లో అనుభవం ఉండటంతో ఏ పాత్ర ఇచ్చినా ఆయన లీనమై నటించే వారు. దీంతో దర్శక నిర్మాతలు ఆయన కోసమే ప్రత్యేకంగా పాత్రలు రాసేవారు.

ఐదు దశాబ్దాలపాటు సినీరంగంలో సాంఘిక, జానపద, పౌరాణిక పాత్రలను పోషించిన ఆయన సుమారు 400 చిత్రాలలో నటించారు. భైరవద్వీపం ఆయన చివరి చిత్రం. నందమూరి తారక రామరావుతోనే ఏకంగా 150 సినిమాల్లో నటించడం ఓ రికార్డు.

మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి మరణంతో జీవించి వున్న తెలుగు సినీ కళాకారుల్లో తానే పెద్ద" అన్నారు డా. అక్కినేని నాగేశ్వరరావు.

నాటక రంగానికి, జానపద కళలకు వీరు చేసిన సేవలకు ఆంధ్ర విశ్వ విద్యాలయం కళా ప్రపూర్ణ పురస్కార మిచ్చింది. తెలుగు విశ్వ విద్యాలయం ఎన్.టి.ఆర్ ఆత్మగౌర పురస్కారంతో ఆయనను సన్మానించింది. 1999లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం లభించింది.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## కేజీ వీల్స్‌తో రోడ్డుపై ట్రాక్టర్లు నడిపితే కేసులు: ఎస్ఐ హెచ్చరిక



కరీంనగర్, జులై 6: పంట పొలాలు దున్నేందుకు ఉపయోగించే కేజీ వీల్స్‌తో రహదారులపై ట్రాక్టర్లు నడిపితే కేసు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామని పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మధుకర్ హెచ్చరించారు.

సోమవారం పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామం వద్ద రహదారిపై కేజీ వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను రూరల్ పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు.

కేజీ వీల్స్‌తో ట్రాక్టర్ నడిపిన యజమానికి రూ.5 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. మరోసారి ఇదే విధంగా పట్టుబడితే కేసు నమోదు చేయడంతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ మధుకర్‌తో పాటు ఏఏఎస్ఐ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బీర్కూరు ఎంజేపీలో ఫుడ్‌ఫాయిజన్.. 17 మంది విద్యార్థులకు అస్వస్థత

కామారెడ్డి, జులై 6:బీర్కూరు మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం రాత్రి భోజనం వికటించి 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని వెంటనే 108 అంబులెన్స్ లో బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాత్రి 12 మంది విద్యార్థులను ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. కాగా సోమవారం మరో ఐదుగురి విద్యార్థులను బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు.

15 మంది విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని వారిని డిశ్చార్జ్ చేసినట్లు, మరో ఇద్దరు విద్యార్థులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బీర్కూర్ మండల వైద్యాధికారిని శ్రీలేఖ తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటలకు భోజనం చేయగా కొంతమంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు మొదలయ్యాయని అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. సోమవారం ఉదయం బీర్కూర్ సర్పంచ్ ధర్మతేజ బాన్సువాడ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు.

## ప్రతీ నెలా పిల్లల బరువు, ఎత్తు ఆన్లైన్‌లో నమోదు చేయాలి.. బోధన్ సీడీపీవో నందిని



నిజామాబాద్, జులై 6:అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతీ నెలా మొదటివారంలో పిల్లల బరువు, ఎత్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బోధన్ సీడీపీవో నందిని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని బీసీ కాలనీ, మాలివాడ అంగన్వాడీ కేంద్రాలను ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల రిజిస్టర్లను పరిశీలించారు.

పిల్లలకు గర్భిణులకు అందించే పౌష్టిక ఆహారాన్ని పరిశీలించారు. చిన్నారులు, గర్భిణీ బాలింతలకు ప్రతీ రోజు మెనూ ప్రకారం పౌష్టికాహారం పెట్టాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి సెక్టార్ సూపర్ వైజర్ కొమురవ్వ, గుమ్మడి ఫౌండేషన్ మేనేజర్ బాల ప్రసాద్, మాధురి, అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, సాయమ్మ పాల్గొన్నారు.

## 'గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత'

### –మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నిజామాబాద్, జులై 6: గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బొడ్రాయి పండుగలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి పండుగ కార్యక్రమానికి హాజరైన ఆయన గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ దేవత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేతో పాటు ప్రజా ప్రతినిధులను, నాయకులను కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ్మా, అయిటి పాముల సర్పంచ్ బెల్లి సుధాకర్, పామనగుండ్ల సర్పంచ్ వడ్డె మాధవి సైదిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పనస సైదులు, నల్లమాద సైదులు, వడ్డె సైదిరెడ్డి, పెద్ది బాల నర్సయ్య, గుండగోని రాములు, మల్లెబోయిన శీను, బీరెల్లి ప్రసాద్, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై అపోహలు నమ్మొద్దు..

### –బీజేపీ మండల అధ్యక్షుడు ఆరే రవీందర్

నిజామాబాద్, జులై 6: భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రజలు ఎలాంటి అపోహలు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని బీజేపీ భీంగల్ మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ కోరారు.

సోమవారం భీంగల్ మండలంలోని బాచన్‌పల్లి గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఓటరు ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ ప్రక్రియను స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఉద్దేశించిన కీలక ప్రక్రియ అని తెలిపారు. అయితే కొందరు కావాలనే ఈ కార్యక్రమంపై ప్రజల్లో అనుమానాలు, అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి అసత్య ప్రచారాలను ప్రజలు విశ్వసించవద్దని సూచించారు.

కామారెడ్డి, జులై 6:



అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా స్వీకరించి, అవసరమైన వివరాలు, సంబంధిత పత్రాలతో పూర్తిగా నింపి బూత్ లెవల్ అధికారికి సమర్పించాలని కోరారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య బలోపేతానికి అవసరమని పేర్కొన్నారు.

ఎన్నికల సంఘం విడుదల చేసే అధికారిక మార్గదర్శకాలను మాత్రమే అనుసరించాలని, సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ఎన్నికల అధికారులు లేదా బీఎల్‌వోలను సంప్రదించి సరైన సమాచారం తెలుసుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు తన బాధ్యతను గుర్తించి ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని ఓటరు జాబితా నవీకరణకు సహకరించాలని ఆరే రవీందర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు శెట్టి ప్రేమ్‌చంద్, బీజేపీ సీనియర్ నాయకులు శెట్టి లక్ష్మణ్, నర్సింగ్, వన్నెల వంశీ, సాయి చరణ్, భాగ్యరాజ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## కన్న తల్లి, కుమారుడి మృతిని తట్టుకోలేక

ములుగు, జులై 6: కని పెంచిన తల్లి అనారోగ్యంతో, చేతికందిని కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఒకరు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మంగవాయి గ్రామానికి చెందిన కంతి నాగయ్య, గౌరమ్మ దంపతులకు అశోక్, అజయ్ ఇద్దరు కుమారులున్నారు. అతడి వద్దే ఉంటున్న తల్లి కన్నమ్మ అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రులు తిరిగి వైద్యం చేయించినా కోలుకోలేక ఈ ఏడాది మార్చి ఆఖరున మృతిచెందింది. తండ్రి ఎప్పుడో చనిపోయారు. తల్లి కూడా మృతి చెందడంతో నాగయ్య దిగాలు చెందారు. దశదిశ కర్మలకు ఏర్పాటు చేసుకున్నారు. కొద్ది రోజులకే పెద్ద కుమారుడు అశోక్ రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదలడంతో నాగయ్య కుంగిపోయారు. మద్యానికి బానిసయ్యారు. ఆదివారం తన వ్యవసాయ పొలానికి వెళ్లి పురుగు మందు తాగి అకస్మారక స్థితిలో పడిపోగా గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. హుటాహుటిన వెంకటాపురం కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు.

## బ్రిక్స్ మహిళా వర్కింగ్ గ్రూపు సమావేశానికి భారత్ ఆతిథ్యం

### కొచ్చి వేదికగా ఈ నెల 6-7 తేదీల్లో జరగనున్న సమావేశం

న్యూఢిల్లీ, జులై 6:ఈ సంవత్సరం బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతల్లో భాగంగా... బ్రిక్స్ మహిళా వర్కింగ్ గ్రూపు సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. కేరళలోని కొచ్చి వేదికగా ఈ నెల 6-7 తేదీల్లో ఈ సమావేశం జరుగుతుంది. బ్రిక్స్ సభ్య దేశాల సీనియర్ ప్రభుత్వ అధికారులు అన్ని రంగాల్లో మహిళా సాధికారత, మహిళల నేతృత్వంలో అభివృద్ధికి సంబంధించిన కీలక సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. ఉమ్మడి ప్రాధాన్యాల విషయంలో సహకారాన్ని పెంపొందించుకునే మార్గాలనూ వారు చర్చిస్తారు.

ప్రజాకేంద్రిత, మానవతా ప్రాధాన్య విధానాన్ని ప్రతిబింబించే "సమర్థత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరతల నిర్మాణం" అనే ఇతివృత్తం మార్గదర్శనంలో భారత బ్రిక్స్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. పరిపాలన, నాయకత్వంలో మహిళలు... మహిళల డిజిటల్, ఆర్థిక నైపుణ్యాలు... మహిళల వ్యవస్థాపన సామర్థ్యాలు, నైపుణ్యాభివృద్ధి... వాతావరణపరమైన చర్యలు, ఆహార భద్రత, పోషణలో మహిళల పాత్ర అనే నాలుగు ప్రాధాన్య అంశాలపై ఈ సమావేశంలో బ్రిక్స్ మహిళా విభాగం ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

మహిళల నేతృత్వంలో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు సభ్య దేశాలు చర్చించి, ఏకాభిప్రాయాన్ని పెంపొందించుకోవడానికి ఈ మహిళా వర్కింగ్ గ్రూపు సమావేశం మంచి అవకాశం కల్పిస్తుంది.

బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండియా, ఇండోనేషియా, ఇరాన్, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అనే 11 దేశాలు భాగంగా ఉన్నాయి. ఇవి ఉమ్మడిగా ప్రపంచ జీడీపీలో సుమారు 40 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

ప్రపంచంలోని సుమారు 49.5 శాతం జనాభాకు బ్రిక్స్ ప్రాతినిధ్యం వహిస్తోంది. మహిళల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధి ప్రతి రంగంలోనూ ఫలితాలను ప్రభావితం చేస్తుంది. అందుకే బ్రిక్స్-2026లో మహిళా విభాగం వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైనదిగా నిలుస్తుంది.

వీడియో అనుసంధానం ద్వారా 30 ఏప్రిల్ 2026, 22 మే 2026, 29 జూన్ 2026 తేదీల్లో నిర్వహించిన మూడు సన్నాహక సమావేశాల ద్వారా జరిగిన విస్తృత సంప్రదింపుల ఆధారంగా ఈ వర్కింగ్ గ్రూపు సమావేశాన్ని రూపొందించారు. ఈ సంప్రదింపులు కొచ్చిలో జరగబోయే సమావేశాలకు ముందుగానే చర్చలను ముందుకు తీసుకెళ్లడానికి సభ్య దేశాలకు వీలు కల్పించాయి.

## ఆపదలో ఉన్నవారికి అండగా ఉండటమే ప్రజాసేవ



కామారెడ్డి, జులై 6: ప్రజాసేవా అంటే ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడటమేనని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ నిరూపించారు. ఆదివారం కామారెడ్డి జిల్లాలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన హైదరాబాద్‌కు తిరిగి పయనమయ్యారు. మార్గం మధ్యలో బిక్నూర్ టోల్ ప్లాజా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించిన ఆయన వెంటనే తన వాహనాన్ని నిలిపివేశారు. ప్రమాదంలో గాయపడిన వారి వద్దకు వెళ్లి పరిస్థితిని తెలుసుకుని, ఆలస్యం చేయకుండా అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేలా చర్చలు చేపట్టారు. బాధితుల ప్రాణాలను కాపాడేందుకు వేగంగా స్పందించిన ఆయన తీరును అక్కడ ఉన్న ప్రజలు అభినందించారు.

## మొబైల్ రికవరీలో పోలీసులు మరోసారి సత్తా..

అమరావతి, జులై 6: మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బాధితులకు అండగా శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ ఉంటుందని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు.

సోమవారం పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రికవరీ చేసిన 141 మొబైల్ ఫోన్లను ఆయా బాధితులకు స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ విభాగం సహకారంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. 2026 మే, జూన్ నెలల్లో మొత్తం 141 మొబైల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని, వాటి అంచనా విలువ రూ.29.70 లక్షలు ఉంటుందని వెల్లడించారు.

రికవరీ చేసిన ఫోన్లను న్యాయపరమైన ప్రక్రియ పూర్తిచేసి బాధితులకు అందజేయడం పోలీసు శాఖకు సంతోషాన్ని కలిగిస్తోందన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.